


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

20.09.2026

ఆదివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 129

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రాష్ట్రానికి వచ్చిన పవన్



### కేరళంలో చికిత్స ముగించుకుని రిటర్న్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేరళలో చికిత్స ముగించుకుని ఏపీకి చేరుకున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం అంతర్జాతీయ వినాశ్రయంలో ఆయనకు నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పవన్ కల్యాణ్ అక్కడి నుంచి నేరుగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు.

## పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రగతి

- ప్రపంచానికి భారత్ ఆదర్శం
- ప్రధాని నరేంద్ర మోడీ కామెంట్
- పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర
- విద్యుత్ రంగంలో ప్రగతిని ప్రత్యేకం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా ఎలా ఎదగాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో పునరుత్పాదక ఇంధనం, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థలు, నీటి సంరక్షణ ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటే ఆర్థిక పురోగతి కూడా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారత్‌కు శతాబ్దాల నుంచి వస్తున్న ఆచారం అని మోడీ గుర్తుచేశారు. తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన భారత్, ఆ సాంప్రదాయ అనుభవాలు, సిద్ధాంతాల పునాదిగానే నేటి ఆధునిక వాతావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

2లో..

# ‘పేదలకు పట్టాభిషేకం’

- 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు
- ఇంటి హక్కు పట్టాలను సీఎం పంపిణీ
- 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించాం
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- దశాబ్దాలుగా ఇళ్లపై ఉన్న అనిశ్చితికి..
- ఈ పట్టాలతో ముగింపు పలుకుతున్నాం
- ఇకపై లబ్ధిదారులు తమ ఇళ్లపై పూర్తి హక్కులు వచ్చాయి
- ‘ఇక మీ ఇళ్లపై ఎలాంటి భయం లేదు’
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



2లో..

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు పట్టాలను సీఎం పంపిణీ చేశారు. మొత్తం రూ.8,874 కోట్ల విలువైన భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. దశాబ్దాలుగా ఇళ్లపై ఉన్న అనిశ్చితికి ఈ పట్టాలతో ముగింపు పలుకుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఇకపై లబ్ధిదారులు తమ ఇళ్లపై పూర్తి హక్కులు కలిగి ఉంటారని చెప్పారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సొంతిల్లు ఉండాలనేది ప్రతి మనిషి కల అని అన్నారు. పేదలకు సొంత ఇళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'మీరు ఉంటున్న ఇళ్లపై సర్వహక్కులు ఇక నుంచి మీవే. మీ ఇళ్లపై ఎలాంటి వివాదం లేదు.. భయం లేదు' అని చంద్రబాబు అన్నారు. పట్టాలు పొందిన తర్వాత అవసరమైతే ఇళ్లపై బ్యాంకు రుణాలు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇళ్ల హక్కు పత్రాలు అందుకోవడం ద్వారా పేద కుటుంబాలకు ఆస్తిపై భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువను పూర్తి చేసి అనకాపల్లికి నీటిని అందించడంతో పాటు విశాఖకు గోదావరి జలాలను తీసుకొస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో గత రెండేళ్లలో 91 ప్రాజెక్టులు వచ్చాయని, ఈ ప్రాంతానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించామని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తంగా రూ.5.37 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ నగరం త్వరలో విశ్వనగరంగా ఎదగనుందని సీఎం చంద్రబాబు అన్నారు.





## సీపీఐతో చర్చలు సానుకూలం

- ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలతోనూ చర్చలు
- ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటాం
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



2లో..

## మంగళగిరిలో అట్టహాసంగా డబ్ల్యూపీఎల్ ప్రారంభం

### హాజరైన నారా బ్రాహ్మణి, మిథాలి రాజ్




2లో..

## నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు



- రేవంత్ ఆ డైలాగ్ దించేశాడు
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- రైతులు రోడ్డెక్కుతున్నరంటే సిగ్గు లేదా..?
- సొంత గ్రామంలో పరిస్థితి దారుణంగా ఉంది

2లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

నీ సొంతూరు కొండారెడ్డి పల్లి రైతులు శ్రీశైలం హైవే ఎక్కి కరెంట్ రావడం లేదని ధర్నా చేస్తున్నరు.. కనబడుతలేదా..? రేవంత్ నీకు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు.

## చరిత్ర సృష్టించిన కండక్టర్ కుమారుడు

- ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికలు
- దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్నాయి
- బీజేపీ, కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలు
- విద్యార్థి విభాగాల మధ్య హోరాహోరీ పోరు



2లో..

## హోం మంత్రి అమిత్ షాకు అస్వస్థత

కర్ణాటక పర్యటనలో ఘటన

రెండు రోజుల పర్యటనలో భాగంగా హుబ్బళ్లికి

1,200 పడకల మెడికల్ కాలేజీ ఆసుపత్రి

ప్రారంభోత్సవానికి హాయన హాజరు కావాల్సి ఉంది

2లో..



## 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- నూతన పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనలో చేతివాటానికి తావివ్వొద్దు
- చేనేతల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు
- అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం.. ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వొద్దు

7లో..

**అమరావతి సెప్టెంబర్ 19, అనంత జనశక్తి ప్రతినిధి**

50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరు గార్చుతున్న అధికారులపై కొరడా ఝుళిపించారు.

### విశాఖ తాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై

## సీఎం సమగ్ర సమీక్ష

- సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో విశాఖకు తాగునీటి కొరత రాకుండా సమగ్ర ప్రణాళిక.
- ఏలేరు కెనాల్ సామర్థ్యాన్ని 350 క్యూసెక్కులకు పెంచాలని సీఎం ఆదేశించారు.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

7లో..



**విశాఖపట్నం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాల పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. మన ప్రాచీన పర్యావరణ ఆలోచనలనే నేటి ఆధునిక పరిష్కారాలుగా మారుస్తూ ప్రకృతిని కాపాడుకుంటున్నామని తెలిపారు. భారత్ వాతావరణ వ్యూహంలో పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర అని మోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం 12 ఏళ్ల క్రితం 2 గిగావాట్లుగా ఉన్న మన సోలార్ సామర్థ్యం, ఈరోజు ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. ఒక్క సోలార్ ఎనర్జీ వల్లే దాదాపు 20 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నిరోధించగలిగామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం కూడా గత 12 ఏళ్లలో మూడు రెట్లు పెరిగిందని, దీనికి తోడు జల విద్యుత్ రంగాన్ని కూడా విస్తరించామని చెప్పారు. వీటితో పాటు అణు విద్యుత్‌ను పెంచడానికి, క్లీన్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కృషి ఫలితంగానే గత పన్నెండేళ్లలో శిలాజయేతర ఇంధనాల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మన దేశం, పారిస్ ఒప్పందంలో 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే, అంటే 2025లోనే సాధించింది. మొత్తం విద్యుత్ సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజయేతర ఇంధనాల నుంచే సాధించి భారత్ రికార్డు సృష్టించింది. గత 12 ఏళ్లలో పర్యావరణానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ భారత్ అసాధారణమైన ప్రగతి సాధించిందని, ఇందులో పునరుత్పాదక ఇంధనానిదే కీలక పాత్ర అని మోడీ కొనియాడారు.

# నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు

(మొదటి పేజీ తరువాయి)

రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సొంత గ్రామ రైతులు రోడ్డెక్కుతున్నరంటే సిగ్గు లేదా..? ఆ డిప్యూటీ సీఎం ఉన్నడు.. ఎల్‌నినోతోని కరెంట్ వస్తలేదని ఆయన అంటడు. ఎల్‌నినోతో కరెంట్ కాదు.. ఎల్‌నినోతో నీళ్లు కాదు.. దేవుడు నీళ్లిచ్చిండు.. బొగ్గు ఇచ్చిండు.. దేవుడు బ్రహ్మాండంగా అన్ని ఇచ్చిండు. దేవుడు మన కేసీఆర్‌ను కూడా ఇచ్చిండు. కేసీఆర్ కరెంట్ తెచ్చి సబ్‌స్టేషన్లు కట్టిండు. బ్రహ్మాండంగా కరెంట్ ఇచ్చిండు. కానీ దురదృష్టమేంటంటే దేవుడు అన్ని ఇచ్చినా మరి పూజారి కరుణించలేదన్నట్టు ముఖ్యమంత్రిగా కూర్చున్నోడికి తెలివిలేక, కరెంట్ ఇచ్చే తెలివి లేక ఇయ్యాళ్ల రైతులను అవస్తలు పెడుతున్నడని ఫైర్ అయ్యారు. యూరియా ఇచ్చే తెలివిలేదు.. రైతు బంధు ఇచ్చే తెలివిలేదు.. రుణమాఫీ ఇచ్చే తెలివిలేదు.. బోనస్ ఇచ్చే తెలివి లేదు.. ఆఖరికి నీళ్లు ఇచ్చే తెలివి కూడా లేదన్నారు.

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును 90% పూర్తి చేసి కేసీఆర్ మీకు అప్పజెప్పి పోయారు. ఏనుగు వెళ్లింది



తోక చిక్కిందన్నట్టు 10 శాతం పని మిగిలి ఉంది. ఓ 45 మీటర్ల కాలువ తవ్వితే అక్కడి దాకా కొడంగల్ దాకా నీళ్లు పోతయ్. కానీ ముఖ్యమంత్రికి ఇష్టం లేదు.. జల్దీజల్దీ చేస్తే కేసీఆర్‌కు పేరొస్తది కదా..అది రానియ్యా అని రేవంత్ ఫిక్సయ్యాడని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నార్లాపూర్ దగ్గర ఒక పంప్ ఆన్ చేసి పోయిండు. మరి కేసీఆర్ చేసిన పనే అని రైతులకు తెలుస్తది.. తప్ప నాకు పేరు రాదు అని చెప్పి.. రేవంత్ రెడ్డి ఎప్పుడూ తొక్కుకుంటూ వచ్చిన.. పండబెట్టిన అని డైలాగ్ చెబుతుంటడు. నిజంగానే ఇయ్యాళ్ల పాలమూరు వ్యవసాయాన్ని పండబెట్టిండు. పాలమూరు రైతులను తొక్కుతున్నడు. నీళ్లు ఇయ్యకుండా మీ బతుకులు ఆగం చేస్తా ఉన్నడని మండిపడ్డారు.

**సబ్‌స్టేషన్ తనిఖీలో కేటీఆర్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు. రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

రోజుకు 5 గంటలే కరెంట్ వస్తుంది సార్.. మాకు కెనాల్ కూడా బంద్ అయింది.. సబ్ స్టేషన్ సిబ్బంది 12 గంటలు కరెంట్ ఇస్తున్నమంటే.. ఇస్తున్నవా.. బయటకు రైతులను అడుగుదామా..? ఒకసారి అని కేటీఆర్ ప్రశ్నించారు. కరెంట్ గురించి అడిగితే పైననే పోయింది.. మాకేం తెల్వదని అధికారులు చెబుతున్నారు.. మా చేన్లు అయితే ఎండిపోతున్నయ్.. ఒకటే మడి పారుతుంది సార్ అంటూ రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 శాతం పనులు చేసిపోతే 10 శాతం పడావు పెట్టి పాలమూరు రైతులను తొక్కుతున్నవ్.. పాలమూరు రైతుల వ్యవసాయాన్ని నాశనం చేస్తా ఉన్నవ్ రేవంత్ రెడ్డి.. వాళ్లు మిమ్మల్ని తరుమక ముందే మన కేసీఆర్ హయాంలో ఎలా కరెంట్ వచ్చేదో.. వెంటనే అలా సరిదిద్దాలని ప్రభుత్వానికి, అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

## మంగళగిరిలో అట్టహాసంగా

# డబ్ల్యూఏపీఎల్ ప్రారంభం



**మంగళగిరి, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నారా బ్రాహ్మణి , భారత జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో మంది మహిళలకు ఇది మంచి ప్లాట్‌ఫామ్ అని పేర్కొన్నారు. నెక్స్ట్ జనరేషన్ మహిళలకు ఈ టోర్నమెంట్ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. టాలెంట్ ఉండి అవకాశం దొరికితే.. నమ్మకంగా సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు.

ఈ సందర్భంగా ఉమెన్ ఏపీఎల్ ట్రోఫీని నారా బ్రాహ్మణి ఆవిష్కరించారు. విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్, గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు, సినీ నటి స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు. హేమచంద్ర, గీతామాధురి పాటలతో అలరించారు. ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ 1 మ్యాచ్‌లో భాగంగా అమరావతి ఈ ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు తలపడుతున్నాయి.

# సీపీఐతో చర్చలు సానుకూలం

**అమరావతి, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పార్టీలు ఇప్పుడు లోకల్‌బాడీ ఎన్నికలపై దృష్టి పెట్టాయి.. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై సీపీఎం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ఇతర వామపక్ష పార్టీలతో సమన్వయం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆర్ఎస్ఎస్ అగ్రనేత మోహన్ భగవత్ లౌకికవాదం సరిపోదని చెప్పడం సరికాదని బీవీ రాఘవులు వ్యాఖ్యానించారు. దేశ పరిపాలన ఏ ధర్మం ప్రాతిపదికన సాగాలని భగవత్ చెబుతున్నారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. దేశ పరిపాలన పౌర ధర్మం ఆధారంగా జరగాలని, మత ధర్మాన్ని రాజ్య పరిపాలనకు ప్రాతిపదికగా చేయడం సరికాదని అన్నారు. యువత మనసులను కలుషితం చేసే ప్రయత్నాలను సీపీఎం వ్యతిరేకిస్తుందని, భగవత్ సూచనలను యువత తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, సెప్టెంబర్ 18న ఉజ్జయినిలో జరిగిన యువ ధర్మ సంసద్‌లో మోహన్ భగవత్ ధర్మం, లౌకికవాదంపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ఇక, అమెరికా వాణిజ్య విధానాలపైనా రాఘవులు స్పందించారు. వంద శాతం టారిఫ్ విధిస్తామని అమెరికా చట్టంలో పేర్కొన్న తొమ్మిది దేశాల్లో భారత్ కూడా ఉందని అన్నారు. భారత్ అమెరికా అడుగుజా



డల్లో నడుస్తున్నప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత్‌పై సరైన దృష్టి లేదని వ్యాఖ్యానించారు. అమెరికా దుందుడుకు చర్యలను ప్రధాని మోదీ వ్యతిరేకించాలని, అమెరికా చమురుపై ఆధారపడకుండా దేశ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆ భారం నేరుగా ప్రజలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీవీ రాఘవులు కోరారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై పడే ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు బీవీ రాఘవులు..

**SIRపై తీవ్ర విమర్శలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపైనా రాఘవులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో SIR జరుగుతున్న తీరు ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం దెబ్బతీస్తున్నట్లుగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణలో 40 లక్షలు, ఢిల్లీలో 30 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 35 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియను 'కాన్స్టిట్యూషనల్ రిగ్గింగ్'గా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రయోజనాల కోసమే SIR ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇవి రాఘవులు చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై సంబంధిత ప్రభుత్వాలు లేదా బీజేపీ వైఖరిని ఈ వ్యాఖ్యలు స్వతంత్రంగా నిర్ధారించవు. ఇక, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై SIR ప్రభావం ఉండకపోవచ్చని రాఘవులు అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థాయిల్లో ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతాయని, అందువల్ల SIR కారణంగా స్థానిక ఎన్నికలకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అన్నారు. ఏపీలో SIR పూర్తయ్యే వరకు స్థానిక ఎన్నికలు నిర్వహించలేమని రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో హైకోర్టుకు తెలిపింది. అనంతరం స్థానిక ఎన్నికలకు అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితాను ఉపయోగించవచ్చని రాష్ట్రం తరపున హైకోర్టులో వాదన కూడా జరిగింది.

**సీపీఐతో చర్చలు సానుకూలం**

స్థానిక ఎన్నికల్లో సీపీఎంతో కలిసి పోటీ చేసే అంశంపై సీపీఐతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. మిగతా ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలతోనూ చర్చలు జరిపి, ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజా సమస్యలను ఎన్నికల ఎజెండాగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ పార్టీలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సన్నాహాలు ప్రారంభించాయి. అధికార కూటమి కూడా గ్రామ, మండల స్థాయిలో సమన్వయం, స్థానిక సమస్యల పరిష్కారం, అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది.

# 'పేదలకు పట్టాభిషేకం'

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో
ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు పట్టాలను సీఎం పంపిణీ చేశారు. మొత్తం రూ.8,874 కోట్ల విలువైన భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. దశాబ్దాలుగా ఇళ్లపై ఉన్న అనిశ్చితికి ఈ పట్టాలతో ముగింపు పలుకుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఇకపై లబ్ధిదారులు తమ ఇళ్లపై పూర్తి హక్కులు కలిగి ఉంటారని చెప్పారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సొంతిల్లు ఉండాలనేది ప్రతి మనిషి కల అని అన్నారు. పేదలకు సొంత ఇళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'మీరు ఉంటున్న ఇళ్లపై సర్వహక్కులు ఇక నుంచి మీవే. మీ ఇళ్లపై ఎలాంటి వివాదం లేదు.. భయం లేదు' అని చంద్రబాబు అన్నారు. పట్టాలు పొందిన తర్వాత అవసరమైతే ఇళ్లపై బ్యాంకు రుణాలు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇళ్ల హక్కు పత్రాలు అందుకోవడం ద్వారా పేద కుటుంబాలకు ఆస్తిపై భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువను పూర్తి చేసి అనకాపల్లికి నీటిని అందించడంతో పాటు విశాఖకు గోదావరి జలాలను తీసుకొస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో గత రెండేళ్లలో 91 ప్రాజెక్టులు వచ్చాయని, ఈ ప్రాంతానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించామని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తంగా రూ.5.37 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ నగరం త్వరలో విశ్వనగరంగా ఎదగనుందని సీఎం చంద్రబాబు అన్నారు.

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్‌గా మారనుందని తెలిపారు. విశాఖలో నీటి సమస్య లేకుండా వచ్చే ఏడాదిలోగా పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో నీటి కొరత రాకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతిలో 89.41 శాతం పచ్చదనం ఉందని, విశాఖను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలనేది తన లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అనేక భూకుంభకోణాలు ఉన్నాయని చంద్రబాబు ఆరోపించారు. వాటన్నింటినీ అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో శాంతి లేకుండా చేశారని విమర్శించారు. రుషికొండలో నిర్మించిన భవనాలను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఎన్ని డేటా సెంటర్లు వచ్చినా విశాఖకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోందని, పేదలకు ఇస్తున్న పట్టాలు వారి పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం వంటివని అన్నారు. అప్పుల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తెచ్చామని, రైల్వే జోన్ రావడంతో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

**వైసీపీ పాలన ఒక పీడకల: చంద్రబాబు**

వైసీపీ పాలన రాష్ట్రానికి ఒక పీడకలని సీఎం చంద్రబాబు విమర్శించారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూకబ్జాలకు పాల్పడ్డారని, చివరకు శ్రీవారి లడ్డూను కూడా కల్తీ చేశారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వైసీపీ కుట్రలు ఆగలేదని, మెగా DSCపై అనేక కేసులు వేశారని అన్నారు. కోర్టులు చివాట్లు పెట్టడంతో ఇప్పుడు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విశాఖకు కంపెనీలు రాకుండా తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. దేవాలయ భూములకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులను తొలగిస్తామని తెలిపారు. గత రెండేళ్లలో 5.50 లక్షల ఇళ్లను నిర్మించి ఇచ్చామని, వచ్చే మార్చిలో మరో 5.52 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

# చరిత్ర సృష్టించిన కండక్టర్ కుమారుడు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మరోసారి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. అధ్యక్షుడు సహా కీలకమైన నాలుగు స్థానాల్లో మూడింటిని ఏబీవీపీ చేజిక్కించుకుంది. అయితే, ఉపాధ్యక్ష పదవి మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుచుకోవడం విశేషం. స్వతంత్రంగా పోటీచేసిన దీపాంశు షోకీన్ .. దాదాపు 14 వేల ఓట్ల భారీ మెజార్టీతో గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించారు. దీపాంశుకు 30,615 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి ఈషు మౌర్యకు 16,910 ఓట్లు, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి వీర్ చత్రత్‌కు 4,313 ఓట్లు వచ్చాయి.

ఈ విజయంపై దీపాంశు మాట్లాడుతూ.. అన్ని కాలేజీల నుంచి తనకు లభించిన మద్దతు ఆధారంగా ఈ ఫలితాన్ని ముందే ఊహించినట్లు తెలిపారు. రాజకీయాల్లో చురుగ్గా ఉన్నవారే కాకుండా, తటస్థంగా ఉండే సాధారణ విద్యార్థులు కూడా తనకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ''నేను ఈ తరహా ఫలితాన్ని ముందుగానే ఊహించాను... అన్ని కాలేజీల నుంచి నాకు మంచి మద్దతు లభించింది. ముఖ్యంగా సాధారణ విద్యార్థులు నా వెంట నిలిచారు. రాజకీయాల్లో భాగం కాని తటస్థ విద్యార్థులను చేరుకోవడం చాలా కష్టమైన విషయమే, కానీ 'ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థుల సంఘం గొంతుక' గా నిలిచిన నన్ను నమ్మి వారు నాకు మద్దతుగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని దీపాంశు వ్యాఖ్యానించారు.




**సామాన్యుడి నుంచి సుప్రీమ్ లీడర్‌గా**

ఢిల్లీలోని పీరాగఢికి చెందిన దీపాంశు తండ్రి ఒక ఆర్టీసీ బస్సు కండక్టర్ కాగా, తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. భగత్ సింగ్ కాలేజ్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన దీపాంశును సివిల్ సర్వీస్ అధికారిగా చూడాలని ఆయన ఆయన తండ్రి కోరుకున్నారు. అయినప్పటికీ, విద్యార్థి రాజకీయాల్లోకి రావడానికే ఆయన మొగ్గుచూపారు. ఇటీవల ఢిల్లీలోని సత్య నికేతన్‌లో పీజీ హాస్టల్ భవనం కూలిపోయిన ఘటనలో బాధితులకు న్యాయం జరిగే వరకు చెప్పులు ధరించనని దీపాంశు ప్రతిజ్ఞ చేసి బలమైన నిరసన తెలిపారు. మొదట్లో ఎన్ఎస్‌యూఐ నుంచి టికెట్ ఆశించి నామినేషన్ వేసినప్పటికీ, ఆ తర్వాత నామినేషన్ వెనక్కి తీసుకోవాలని పార్టీ కోరింది. అందుకు నిరాకరించిన ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు.

ఇక, అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ అభ్యర్థులు దక్కించుకున్నారు. అధ్యక్షుడిగా యష్‌దబాస్ 24,576 ఓట్లు సాధించగా.. ఆయన ప్రత్యర్థి NSUI అభ్యర్థి విజయ్ శంకర్ మీనాకు 22,523 ఓట్లు వచ్చాయి. సెక్రెటరీగా గెలిచిన రియా ఛావడికి 21,650 ఓట్లు వస్తే.. NSUI అభ్యర్థి నమ్రతకు 14,869 ఓట్లు.. జాయింట్ సెక్రటరీగా లక్ష్య రాజ్ సింగ్ 16,615 ఓట్లు రాగా.. ప్రత్యర్థులైన సమాజ్‌వాదీ ఛాత్ర సభ అభ్యర్థి విశేష్ యాదవ్‌కు 15,778 ఓట్లు, NSUI అభ్యర్థి గోపాల్ యాదవ్‌కు 15,206 ఓట్లు లభించాయి.

# హోం మంత్రి అమిత్ షాకు అస్వస్థత

**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. హుబ్బళ్లిలో రూ.700 కోట్లతో నిర్మించిన కేఎల్‌ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసావిరమఠ్ వైద్య కళాశాల భవనంతోపాటు, 1,200 పడకల కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా శనివారం ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రే ఆయన హుబ్బళ్లికి చేరుకున్నారు. ఈ క్రమంలో అస్వస్థతకు హోమ్ మంత్రి గురికావడంతో డాక్టర్ల సలహా మేరకు ప్రారంభోత్సవానికి హాజరుకాకుండా హోటల్‌కే పరిమితమయ్యారు.

ఈ కార్యక్రమానికి అమిత్ షా దూరంగా ఉండటంతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కేఎల్‌సీ సొసైటీ ఛైర్మన్



ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి అమిత్ షా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. ఆరోగ్య కారణాల రీత్యా దూరంగా ఉన్నారని అన్నారు. కాగా, హుబ్బళ్లికి చేరుకున్న అమిత్ షాకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిసాదర స్వాగతం పలుకుతూ.. ఈ సంస్థ ఉత్తర కర్ణాటకలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. ''ఈరోజు హుబ్బళ్లి విమానాశ్రయానికి విచ్చేసిన గౌరవ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సాదర స్వాగతం. ఉత్తర కర్ణాటకలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించే కేఎల్‌ఈ సొసైటీకి చెందిన జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరసవీర్మఠ్ మెడికల్ కాలేజ్ (జేజీఎంఎంఎంసీ), హాస్పిటల్, మెడికల్ రిసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవం కోసం ఆయన ఇక్కడికి విచ్చేశారు'' అని జోషి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో రూ. 700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మెడికల్ కాలేజీలో 30 లక్షల చదరపు అడుగులకుపైగా నిర్మిత ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో వైద్య విద్య, అధునాతన ఆరోగ్య సంరక్షణ, డయాగ్నోస్టిక్స్, చికిత్స, వైద్య పరిశోధనలను బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ కొత్త మెడికల్ కాలేజ్, ఆసుపత్రిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలు, అత్యాధునిక వైద్య పరికరాలు సహా ఆధునిక సాంకేతికతను ఏర్పాటు చేసినట్లు కేఎల్‌ఈ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ ప్రభాకర్ కోరే తెలిపారు.

# శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి.. విద్యార్థులకు అజిత్ డోభాల్ పిలుపు



శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపునిచ్చారు. రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు రాక్షస సంహారానికి ఆయన్ని ఎంచుకున్నారని వివరించారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా అజిత్ డోభాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. అద్భుతమైన భవిష్యత్ దిశగా భారత్ పరుగులు తీస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా భారత్‌కు 2047 వరకు అమృత్ కాలమని డోభాల్ అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా తన ఉద్యోగ జీవితం ప్రారంభంలో ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో ఉద్యోగం చేస్తున్న సమయంలో అక్కడ మౌంటైన్ గైడ్‌గా పని చేస్తున్న వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు చెప్పారు. మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం మొదటి సూత్రం. ఎక్కడికి వెళ్లాలో తెలుసుకోవడం రెండోది (కచ్చితమైన లక్ష్యం). అక్కడికి వెళ్లి తిరిగి ఎలా రావాలో తెలుసుకోవడం మూడోది. ఈ మూడు సూత్రాలూ.. విజయానికి చక్కటి మార్గాలని డోభాల్ తెలిపారు.

# ఎగ్జామ్ హాల్‌లో ఫోన్‌తో దొరికి.. ఐఐటీ బాంబే విద్యార్థి ఆత్మహత్య



ఐఐటీ బాంబేకు చెందిన పవయీ క్యాంపస్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల అతడు పరీక్ష హాల్‌లో మొబైల్ ఉపయోగించి దొరికిపోయాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి తన హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.
ఇనిస్టిట్యూట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రెండో సంవత్సరం చదువుతోన్న సాహిల్ (19).. ఇటీవల పరీక్ష జరుగుతుండగా మొబైల్ ఫోన్ వినియోగించాడు. ప్రశ్నపత్రాన్ని చాట్‌జీపీటీ లో అప్‌లోడ్ చేస్తూ దొరికిపోయాడు. ఇందుకు గానూ అధికారులు అతడిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టలేదు. అయితే, డిపార్ట్‌మెంట్ హెడ్.. సాహిల్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఇనిస్టిట్యూట్ అధికారులు పేర్కొన్నారు. అయినప్పటికీ సాహిల్ బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. ఈ ఏడాది ఐఐటీ బాంబేలో చోటుచేసుకున్న నాలుగో మరణం ఇది. దీంతో నిన్న రాత్రి క్యాంపస్‌లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వరుస ఆత్మహత్యలపై యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల నేపథ్యంలో క్యాంపస్‌లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మరోవైపు, ఘటనపై ఐఐటీ బాంబే ప్రకటన విడుదల చేసింది. "విద్యార్థి మరణం పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. ఈ విచారకర సమయంలో మృతుడి స్నేహితులు, కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నా. ఘటనకు గల కారణాలపై సంబంధిత అధికారులతో దర్యాప్తు చేస్తున్నాం" అని తమ ప్రకటనలో వెల్లడించింది.

# సంపూర్ణ మద్య నిషేధంతో నష్టాలే ఎక్కువ: సుప్రీంకోర్టు



సంపూర్ణ మద్య నిషేధం అసలు సమస్యను పరిష్కరించకపోగా ఇతరత్రా అనేక కష్టనష్టాలకు కారణమవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమ సారా వ్యాపారాలు, కల్తీలు, దొంగచాటు రవాణాలు, రహస్యంగా మద్యం తాగడం వంటివాటికి ఇది దారితీస్తుందని హెచ్చరించింది. ప్రభుత్వాలు పన్ను రాబడులను కోల్పోవడంతో పాటు మద్య నిషేధం అమలుకు భారీగా ఖర్చుపెట్టాల్సి వస్తుందంటూ పలు నిదర్శనాలను ప్రస్తావించింది. కల్తీమద్యం సమస్యను నివారించేందుకు గాను ఔషధేతర తయారీదారులకు విక్రయించే మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిబంధనను శుక్రవారం కొట్టివేస్తూ వెలువరించిన తీర్పులో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం ఈ విషయాలను పేర్కొంది. కల్తీమద్యం మరణాల నివారణకు గాను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పలు సూచనలు చేసింది. "రంగు, రుచిని మార్చడం వల్లకానీ, అందుబాటులో లేకుండా చేయడం వల్ల కానీ మద్యం తాగాలన్న తీవ్రమైన తృష్ణను వ్యసనపరులు వదులుకోలేరు. దీనికి బదులుగా ఎక్సైజ్ చట్టాలను బలోపేతం చేసి మద్యం రవాణా, నిల్వ, తయారీపై కఠిన నియంత్రణలను అమలుచేయడం ఉత్తమం. మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర నిబంధనలు ఔషధేతర ఉత్పత్తిదారుల పరిశ్రమలను దెబ్బతీస్తాయి. మిథనాల్ విక్రయాలు, సరఫరాపై గట్టి నియంత్రణ చర్యలు అవసరం. మహారాష్ట్ర ప్రభుత్వ తీసుకొచ్చిన నిబంధనలు రాజ్యాంగబద్ధంగా, సహేతుకంగా లేవు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## రూ.8వేలకు ప్రశ్నపత్రాన్ని బయటకు పంపి..
# టెట్ పేపర్ లీకేజీలో సంచలన విషయాలు..!



మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆగ్రాలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ ప్రశ్నపత్రాలను ఇద్దరు ఉద్యోగులు షూ ఇన్‌సోల్‌లో దాచి బయటకు తరలించినట్లు పోలీసులు తమ ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను దొంగిలించినందుకు గానూ.. ఆ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి నిందితులు రూ.8 వేల చొప్పున చెల్లించినట్లు తెలిపారు. దీంతో పాటు ఆగ్రాలో భూమి స్థలాలు ఇప్పిస్తామని నిందితులు హామీ ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటివరకు 16 మందిని అరెస్టు చేయగా.. ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నారు.
ఈ ఏడాది జూన్ 28న మహారాష్ట్రలో టెట్ పరీక్ష జరగాల్సి ఉండగా.. ఒకరోజు ముందు పేపర్ లీక్ వ్యవహారం బయటపడింది. దీంతో నాటి పరీక్షను వాయిదా వేశారు. భివండీకి చెందిన ఓ వ్యక్తికి ప్రశ్నపత్రాలు విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమై.. వారి నుంచి నాలుగు సెట్ల పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. అవి నిజమైన ప్రశ్నపత్రాలేనని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులు నిర్ధరించారు. టెట్ పేపర్ల ముద్రణ బాధ్యతలను ఆగ్రాలోని ఓ సంస్థకు అప్పగించారు. అధికారులు నాలుగు సెట్ల ప్రశ్నపత్రాలను సిద్ధం చేయగా.. ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే ఉద్యోగులు అన్నింటినీ బయటకు తీసుకెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. భద్రతా సిబ్బంది రోజూ ఉద్యోగుల దుస్తులను తనిఖీ చేస్తున్నా.. బూట్లను పరిశీలించకపోవడాన్ని వారు అనుకూలంగా మలచుకుని ఈ లీక్‌కు పాల్పడ్డట్లు తెలిపారు. ఈ కేసులో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు బిజేంద్ర గుప్తాను ప్రధాన సూత్రధారిగా చేర్చారు. అతడిపై గతంలో ఒడిశా పేపర్ లీక్ కేసులోనూ ఆరోపణలు ఉన్నాయి.

# మహిళను కొట్టి చంపి.. ఏడుస్తున్న చిన్నారిని ఆమె మృతదేహంపై ఉంచిన హంతకులు



కొందరు వ్యక్తులు ఒక మహిళను కొట్టి చంపారు. ఏడుస్తున్న కుమార్తె అయిన ఏడాదిన్నర వయస్సున్న చిన్నారిని ఆమె మృతదేహంపై ఉంచి పారిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ మహిళ భర్త, ఆమె ప్రియుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సింధనూర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌హెచ్ క్యాంప్ ప్రాంతంలో నివసించే 25 ఏళ్ల స్నేహపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. రాయితో ఆమె తలపై కొట్టి చంపారు. ఏడుస్తున్న ఏడాదిన్నర వయస్సున స్నేహ కుమార్తెను ఆమె మృతదేహంపై ఉంచి అక్కడి నుంచి పారిపోయారు.
కాగా, గ్రామం శివార్లలోని పొలంలో స్నేహ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమార్తె అయిన చిన్నారి చనిపోయిన తన తల్లిని గట్టిగా పట్టుకుని నిస్సహాయంగా ఏడుస్తూ కనిపించింది. ఇది చూసి పోలీసులు, స్థానికులు చలించిపోయారు. ఆ మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
మరోవైపు నాలుగేళ్ల కిందట అమిత్‌తో స్నేహకు వివాహం జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. గత నాలుగు నెలలుగా శుభమ్ అనే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ నేపథ్యంలో స్నేహ భర్త, ఆమె ప్రియుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను హత్య చేసిన వ్యక్తులు, అందుకు కారణాలు తెలుసుకునేందుకు వారిద్దరిని ప్రశ్నిస్తున్నారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ఆంగ్ల భాషపై శశిథరూర్‌కు ఉన్న పట్టు అంతాఇంతా కాదు..
# అయినా గ్రామర్ మిస్టేక్ చేశారు..!

ఆంగ్ల భాషపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ కు ఉన్న పట్టు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన మాట్లాడే తీరు, వాడే పదాలు, రచనా శైలి.. పాశ్చాత్య దేశాల పండితులను సైతం మరిపిస్తాయి. అనేక సందర్భాల్లో ఆయన వాడిన పదాలు నెట్టింట్లో చర్చకు దారితీశాయి. అంతటి పట్టున్న వ్యక్తి ఇంగ్లిష్‌లో తప్పు చేశాడంటే ఎవరైనా నమ్ముతారా..? కానీ అంతటి వ్యక్తి సైతం మిస్టేక్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ థరూర్ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌లో ఓ చిన్న వ్యాకరణ దోషం దొర్లింది. దాన్ని నెటిజన్లు గుర్తించడంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. సెప్టెంబర్ 17న మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా థరూర్ 'ఎక్స్' లో శుభాకాంక్షలు తెలిపారు. అయితే 'ఆయన 76వ పుట్టినరోజు సందర్భంగా' అనే అర్థం వచ్చేలా అని రాయాల్సింది పోయి అని రాశారు. దాంతో ఆ చిన్న తప్పిదం కాస్తా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ పోస్టుపై పలువురు నెటిజన్లు స్పందించారు. ఇది వ్యాకరణ తప్పిదమా..? టైపింగ్ పొరపాటా..? అంటూ చర్చించారు. కీబోర్డులో 'I', 'O' అక్షరాలు పక్కపక్కనే ఉండటంతో పొరపాటు జరిగి ఉండొచ్చని కొందరు సరదాగా చెప్పారు. మరికొందరు మాత్రం థరూర్ లాంటి ఇంగ్లిష్ పండితుడి నుంచి ఇలాంటి తప్పు రావడమే ఆశ్చర్యంగా ఉందంటూ కామెంట్లు చేశారు. అయితే ఈ విమర్శలను థరూర్ పట్టించుకోకుండా వదిలేయలేదు. ఓ నెటిజన్ కామెంట్‌కు థరూర్ స్పందిస్తూ తన పొరపాటును స్వయంగా అంగీకరించారు. 'ఆయన పుట్టినరోజు సందర్భంగా' రాయాల్సిన చోట 'in' వచ్చిందని, ఇలాంటి పొరపాట్లు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంటాయని సరదాగా బదులిచ్చారు. దాంతో ఈ చిన్న వ్యాకరణ పొరపాటు సోషల్ మీడియాలో సరదా చర్చగా మారింది. సాధారణంగా థరూర్ రాసే క్లిష్టమైన ఇంగ్లిష్ పదాల కంటే ఈసారి ఓ చిన్న పదమే అందరి దృష్టినీ ఆకర్షించింది.



## ఇంకా మగబిడ్డకే ప్రాధాన్యమా?..
# బాంబే హైకోర్టు ప్రశ్న



కుటుంబంలో మరో ఆడపిల్ల పుట్టిందన్న అక్కసుతో నెల రోజులు కూడా నిండని మనవరాలిని హత్య చేసిన వ్యక్తికి బెయిలు మంజూరు చేసేందుకు బాంబే హైకోర్టు నిరాకరించింది. స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు కావస్తున్నా కొందరు ఇంకా మగ సంతానమే కోరుకోవడం దురదృష్టకరమని కోర్టు అభిప్రాయపడింది. నాగ్‌పుర్ బెంచికి చెందిన జస్టిస్ ఎం.ఎం.నెర్లీకర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు గోపీనాథ్ జంకూ ప్రధాన్ బెయిలు కోసం చేసుకున్న అభ్యర్థనను ఆయన తిరస్కరించారు. తూర్పు మహారాష్ట్రలోని గచ్చిరోలి జిల్లా పోలీసులు నిందితునిపై 2023లో కేసు నమోదు చేశారు. హత్యకు పాల్పడటంతోపాటు అందుకు సంబంధించిన సాక్ష్యాలను చెరిపేశాడని అతనిపై అభియోగం. తన కుమారునికి మళ్లీ ఆడబిడ్డ పుట్టిందనే అక్కసుతో నిందితుడు నెల రోజులు కూడా నిండని ఆడబిడ్డను నీటిలో ముంచి హతమార్చాడని పోలీసుల కథనం. తాను నిర్దోషినని నిందితుడు కోర్టుకు విన్నవించాడు. కేసులో సహనిందితురాలైన బిడ్డ తల్లికి బెయిలు మంజూరైన విషయాన్ని న్యాయస్థానానికి తెలియజేశాడు. "స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ మన దేశంలో ప్రజలు మగబిడ్డే కావాలని కోరుకోవడం దురదృష్టకరం" అని జస్టిస్ నెర్లీకర్ వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్యే ఖాతా నుంచి
# రూ.1.55 లక్షలు చోరీ



సైబర్ కేటుగాళ్లు ఏకంగా ఎమ్మెల్యేనే బురిడీ కొట్టించారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి దశలవారీగా రూ.1.55 లక్షలు మాయం చేశారు. ఈ మేరకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే పూజా పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 13 మధ్య కాలంలో దశలవారీగా డబ్బు తీశారని పేర్కొన్నారు. తన ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేసి ఫోన్ పే ద్వారా ఈ మోసానికి పాల్పడి ఉండొచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పూజా పాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం చైల్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు.

# అమ్మాయితో ట్రిప్.. భార్యను మభ్యపెట్టేందుకు ఇమిగ్రేషన్ నాటకం

భార్యకు తెలియకుండా ఓ అమ్మాయితో ఫారెన్ ట్రిప్‌నకు వెళ్తుండగా.. పాస్‌పోర్ట్ సమస్య తలెత్తడంతో వ్యాపారవేత్త ప్లాన్ బెడిసి కొట్టింది. దానిని కవర్ చేసేందుకు భార్యకు అబద్ధం చెప్పడంతో చివరికి పోలీసులకు చిక్కాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?
పుణెకు చెందిన 46 ఏళ్ల వ్యాపారవేత్త ఓ యువతితో ఫారెన్ ట్రిప్ వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నారు. వ్యాపార పర్యటన నిమిత్తం మలేషియాలోని కౌలాలంపూర్ వెళ్తున్నానని తన భార్యకు చెప్పాడు. ట్రిప్ కోసం యువతితో ముంబయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమిగ్రేషన్ తనిఖీల సమయంలో ఆమె గడువు ముగిసిన పాస్‌పోర్టు ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వారిని అడ్డుకున్నారు. గడువు ముగిసిన పత్రాలతో అధికారులను మోసం చేయడానికి ప్రయత్నించినందుకు లీగల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లీగల్ చర్యలు తీసుకుంటే అమ్మాయి విషయం తన భార్యకు తెలిసిపోతుందని భావించిన వ్యాపారవేత్త ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి ఓ ప్లాన్ వేశారు.
విమానాశ్రయంలోని ల్యాండ్ లైన్ నుంచి తన భార్యకు ఫోన్ చేసి, ఇమిగ్రేషన్ సమస్య వల్ల తన మొబైల్ ఫోన్‌ను అధికారులకు అప్పగించాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, అక్కడి నుంచి వారు మరో ప్రాంతానికి వెళ్లారు. వ్యాపారవేత్త మరుసటి రోజు కూడా భార్యతో తన వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఫోన్ అందుబాటులో లేకుండా పోయింది. దీంతో అతడి భార్య పోలీసులను ఆశ్రయించారు. తన భర్తను ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తన గురించి వెతుకుతున్నట్లు తెలుసుకున్న వ్యాపారవేత్త పోలీస్ స్టేషన్ వెళ్లి వారికి అసలు విషయం చెప్పాడు. ఫారెన్ ట్రిప్ విషయం తన భార్యకు తెలియకుండా ఉండేందుకు ఇమిగ్రేషన్ కథ అల్లినట్లు తెలియజేశారు. దీంతో ఆశ్చర్యపోవడం వారి వంతైంది.

# హనీమూన్ ట్రిప్‌లో విషాదం.. బార్బెక్యూ ఫైర్‌లో నవవధువుకు తీవ్ర గాయాలు

పశ్చిమ బెంగాల్‌లోని దార్జిలింగ్‌లో హనీమూన్‌కు వెళ్లిన నవ దంపతులకు ఊహించని రీతిలో ప్రమాదం ఎదురైంది. ఓ వసతి గృహంలో బార్బెక్యూ సిద్ధం చేస్తుండగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నవ వధువు తీవ్ర గాయాలపాలైంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్తకూ గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పశ్చిమ బెంగాల్‌లోని 24 నార్త్ పరగణాల జిల్లాకు చెందిన సమీర్ దాస్‌కు నిఖిత సాహాతో రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం హనీమూన్ కోసం దార్జిలింగ్‌లోని సిటోంగ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ హోమ్‌స్టే చేస్తున్న సమయంలో బయట కూర్చొని బార్బెక్యూ సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది బార్బెక్యూపై ఓ ద్రావణాన్ని పోయగా.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు నిఖితకు అంటుకోవడంతో ఆమె తీవ్ర గాయాలపాలయ్యారు. 60శాతం కాలిన గాయాలతో సిలిగుడిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను కాపాడబోయిన భర్త సమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.
ఈ వ్యవహారంలో హోమ్‌స్టే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోలేదని సమీర్ కుటుంబీకులు ఆరోపించారు. కనీసం నిఖితను ఆసుపత్రికి తరలించేందుకు కూడా ఎలాంటి వాహనం సమకూర్చలేదన్నారు. అయితే, ఉద్యోగి నిర్లక్ష్యం కనిపిస్తోందని, వంట నూనెకు బదులు కిరోసిన్ పోయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని హోమ్‌స్టే నిర్వాహకుడు అంగీకరించాడు. దీనిపై బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# అందరికీ 'ప్రామాణిక సమయం'

భారత ప్రామాణిక కాలమాన (ఐఎస్‌టీ) నిబంధనలు- 2026ను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 27న నోటిఫై చేసింది. దీంతో భారతదేశం తన అధికారిక, వాణిజ్య, పాలనపరమైన అవసరాల కోసం ఐఎస్‌టీని చట్టపరమైన సమయ సూచికగా మార్చే దిశగా ముందడుగు వేసింది. ఈ నూతన నిబంధనలకు అనుగుణంగా సంస్థలు తమ సిస్టమ్‌లను మార్చుకోవడానికి 180 రోజుల గడువునిచ్చారు. ఆ తర్వాత ఈ నిబంధనలు పూర్తిగా అమల్లోకి వస్తాయి. బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు, టెలికాం సేవలు, రవాణా వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్‌లు, ప్రభుత్వ నెట్‌వర్క్‌లన్నీ ఇప్పుడు కచ్చితమైన, ధ్రువీకరించదగిన టైమ్‌స్టాంప్‌పై ఆధారపడుతున్నాయి. అందుకే భారత కాలమాన వ్యవస్థలో తెస్తున్న మార్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నూతన వ్యవస్థ వల్ల దేశంలో ఏం మారనుంది? కీలక రంగాలపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? వంటి అంశాలపై సీఎస్ఐఆర్-నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) టైమ్ అండ్ ఫ్రీక్వెన్సీ మెట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ పూనమ్ అరోరా... 'ఈటీవీ భారత్' ప్రతినిధి సౌరభ్ శుక్లాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది...

**ఐఎస్‌టీని చట్టపరమైన సూచికగా మార్చడం వల్ల లాభమేంటి?**

భారతదేశం దశాబ్దాలుగా ఐఎస్‌టీని పాటిస్తున్నా, దీనికి ప్రత్యేక చట్టపరమైన రక్షణ లేదు. కొత్త మార్పు అధికారిక, చట్టపరమైన ప్రయోజనాల కోసం ఐఎస్‌టీని తిరుగులేని విశ్వసనీయ సూచికగా స్థిరపరుస్తుంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో నేషనల్ మెట్రాలజీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే సమయాన్నే చట్టపరమైన సమయంగా పరిగణిస్తారు. మన దేశంలోనూ ఐఎస్‌టీ జాతీయ సూచికగా ఉన్నప్పటికీ, సంస్థలు తమ సిస్టమ్‌లను ఐఎస్‌టీ ట్రేసబుల్ టైమ్‌తో సింక్రొనైజ్ చేయాలనే కఠిన నిబంధన గతంలో లేదు. మరోవైపు మన కార్యకలాపాలు ఎక్కువగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, సోషల్ మీడియా, హై-స్పీడ్ ట్రేడింగ్ సేవలకు మారిపోయాయి. ఇలాంటి వేదికల్లో లావాదేవీల కచ్చితమైన సమయాన్ని గుర్తించడం ద్వారా సైబర్ మోసాలు, వివాదాలను పరిష్కరించడంలో ఈ కొత్త చట్టం ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు ఒక స్టాండ్‌అలోన్ కంప్యూటర్‌లో ఎవరైనా మాన్యువల్‌గా సమయాన్ని మార్చవచ్చు. కానీ చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అమల్లోకి వచ్చిన తర్వాత అది కుదరదు. ఒక సంస్థ తన సిస్టమ్‌లోని టైమ్‌స్టాంప్ మాన్యువల్‌గా నమోదు చేసింది కాదని, కచ్చితంగా ఐఎస్‌టీకి ట్రేసబుల్‌గా ఉందని నిరూపించాల్సి ఉంటుంది.

**ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, సరైన ఐఎస్‌టీ టైమ్‌స్టాంప్‌ను చేతి గడియారం లేదా ఫోన్ ద్వారా తనిఖీ చేయవచ్చా?**

అలా నేరుగా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే, సాధారణ వినియోగదారులు నేరుగా స్మార్ట్‌ఫోన్‌లో ఐఎస్‌టీని చూసేలా ప్రత్యేకంగా ఒక అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. దానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న ఏకపక్ష సమయ మూలాలపైన, ముఖ్యంగా దేశం వెలుపల ఉన్న సర్వర్‌లపైన ఆధారపడటాన్ని ఇది తగ్గిస్తుంది. దీనివల్ల సంస్థలు పూర్తిగా స్వదేశీ జాతీయ సమయ సూచికపై ఆధారపడగలుగుతాయి.

**కొత్త నిబంధనల అమలుకు ఎలాంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు?**

ఈ నిబంధనలను తప్పనిసరి చేసే ముందు మూలాలను బలోపేతం చేయడానికీ, బహుళ ఛానెళ్ల ద్వారా ప్రామాణిక సమయం అందుబాటులో ఉంచడానికీ అహ్మదాబాద్, బెంగళూరు, ఫరీదాబాద్, భువనేశ్వర్, గువాహటిలలోని అయిదు ప్రాంతీయ కేంద్రాల్లో సెకండరీ అటామిక్ టైమ్‌స్కేల్‌స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల సమయం కోసం ఎన్‌పీఎల్‌పై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

**కీలక వ్యవస్థలకు చట్టపరమైన జాతీయ సమయ సూచిక ఎందుకు ముఖ్యం?**

వివిధ రంగాలకు విభిన్న స్థాయుల్లో సమయ కచ్చితత్వం అవసరం. ఇస్రోకు తన ఉపగ్రహ కార్యకలాపాల కోసం నానో సెకండ్ స్థాయి సమయ కచ్చితత్వం కావాలి. బ్యాంకులకు మిల్లీసెకండ్ స్థాయి కచ్చితత్వంతో సేవలు అవసరపడతాయి. అనేక బ్యాంకులు ఇప్పటికే ఉచితంగా అందుబాటులో ఉన్న ఎన్‌పీఎల్ నెట్‌వర్క్ టైమ్ ప్రోటోకాల్ (ఎన్‌టీపీ) సేవలను ఉపయోగిస్తున్నాయి, ఈ సేవలను కొన్ని బ్యాంకులు ఉపయోగించుకోవడం లేదు. కానీ నిబంధనలు అమలులోకి వచ్చిన తర్వాత, నిర్దేశిత అధికారిక మూలాల నుంచి సమయాన్ని పొందాల్సి ఉంటుంది. వాటి టైమ్‌స్టాంప్‌లు ఒకే జాతీయ సూచికకు కనెక్ట్ అవుతాయి.

**వివాదాలను లేదా టైమ్‌స్టాంప్‌ల తారుమారును ఎలా నివారిస్తారు?**

ఉదాహరణకు తత్కాల్ వంటి ఆన్‌లైన్ సిస్టమ్‌లో బుకింగ్ ప్రారంభమైన వెంటనే తాను లాగిన్ అయ్యానని, కానీ అప్పటికే టికెట్లు అయిపోయాయని ప్రయాణికుడు చెప్పవచ్చు. సర్వర్ సమయాన్ని మార్చగలిగితే, సిస్టమ్ వాస్తవంగా ఎప్పుడు ప్రారంభమైందనే దానిపై వివాదం రావొచ్చు. కానీ సర్వర్‌ను చట్టపరంగా గుర్తించిన జాతీయ సూచికతో సింక్రొనైజ్ చేస్తే, టైమ్‌స్టాంప్ ధ్రువీకరణ వల్ల సిస్టమ్ గడియారాన్ని తారుమారు చేయడం కష్టమవుతుంది. బ్యాంకింగ్, ట్రేడింగ్, ఇతర డిజిటల్ లావాదేవీలకూ అదే సూత్రం వర్తిస్తుంది.

**సాధారణ పౌరులు, వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది?**

సాధారణ పౌరులకు రోజువారీ జీవితంలో పెద్దగా మార్పు ఉండదు. మొబైల్ ఫోన్లు టెలికాం నెట్‌వర్క్ ద్వారా సమయాన్ని పొందుతాయి. టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు తమ సిస్టమ్‌లను ఐఎస్‌టీతో సింక్రొనైజ్ చేస్తే వినియోగదారులకు సరైన సమయం లభిస్తుంది. అత్యంత కచ్చితత్వం అవసరమైన వ్యూహాత్మక రంగాలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్లు లేదా వైట్ రాబిట్ టెక్నాలజీ వంటి అధునాతన పద్ధతులు ఉపయోగపడతాయి. వైట్ రాబిట్ అనేది ప్రిసిషన్ టైమ్ ప్రోటోకాల్‌కు ఆధునిక రూపం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ దీన్ని ఉపయోగిస్తోంది. 180 రోజుల పరివర్తన కాలంలో మిల్లీసెకండ్ స్థాయి కచ్చితత్వం కోసం ఎన్‌టీపీ సేవలను ఉపయోగించవచ్చు. అధిక కచ్చితత్వం కావాల్సినచోట మాత్రమే ప్రత్యేక పరికరాలు అవసరమవుతాయి.

# నీలి విప్లవంలో నవభారత శకం

**'సబ్‌కా సాథ్.. 'సబ్‌కా వికాస్.. 'సబ్‌కా విశ్వాస్.. 'సబ్‌కా ప్రయాస్' అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వ తారకమంత్రం. భారతదేశ అభివృద్ధి ప్రస్థానాన్ని అది సదా సార్వజనీనంగా, సర్వతోముఖంగా నిలుపుతోంది. గడచిన పాతికేళ్లలో కోట్లాది ప్రజల, ప్రత్యేకించి పేద–అణగారిన వర్గాలవారి జీవితాలను మోదీ తన విశిష్ట పాలనా దక్షతతో అమితంగా ప్రభావితం చేశారు. ఆర్థిక ప్రగతిపై ఆయన విధానం అందరికీ ఆదర్శప్రాయం. వెనుకబడిన జిల్లాలను 'ఆకాంక్షాత్మక జిల్లాలు'గా, సరిహద్దు గ్రామాలను 'సమర్థ–ప్రథమ గ్రామాలు'గా, ఈశాన్య ప్రాంతాన్ని 'అష్టలక్ష్మి'గా అభివర్ణించడం ఆయన పరిణామాత్మక దృక్పథానికి ప్రతీక. ఈ విధానం భౌగోళిక వివక్షను సాధికారతగా రూపుదిద్ది, వికసిత భారత్ దిశగా ప్రస్థానంలో వివిధ వర్గాల క్రియాశీల భాగస్వామ్యానికి బాటలు వేసింది. 'పీఎం జన్మాన్, పీఎం జన్-ధన్, పీఎం- గరీబ్ కల్యాణ్ యోజన' వంటి పథకాలే ఈ విజయానికి నిదర్శనం. వీటితో పాటు ఇతరత్రా అమలుపరుస్తోన్న కార్యక్రమాలు కూడా సార్వజనీన ప్రగతి, సామాజిక సాధికారతపై ప్రధానమంత్రి నిబద్ధతను చాటిచెబుతున్నాయి. కనుకనే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారు. ఈ అపూర్వ పురోగతి మన జాతి జీవనంలోనే కాకుండా సమస్త మానవాళి చరిత్రలో కూడా ఒక చిరస్మరణీయ మలుపు. ప్రపంచవ్యాప్తంగా పేదరికం, ఆకలి దప్పుల నుంచి నిరుపేదలు శాశ్వతంగా బయటపడే రోజు త్వరలోనే తప్పక వస్తుందనడానికి ఈ భారత విజయం ఒక శుభ సంకేతం.**

ఈ సార్వజనీన వృద్ధికి మరింత భరోసా, సుస్థిరత కల్పించేందుకు ప్రధాని మోదీ 'నీలి ఆర్థిక వ్యవస్థ'పై దృష్టి సారించారు. హరిత విప్లవం 1960ల్లో దేశ ప్రజల క్షుద్బాధను తీర్చింది. తదాదిగా ప్రపంచ ఆహార భద్రతలో భారత్ పాత్ర మరింత పటిష్ఠమవుతోంది. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో భారత్ నేడు ప్రపంచ అగ్ర దేశాలలో ఒకటిగా నిలిచింది. హరిత విప్లవం శ్వేత విప్లవంతో దేశంలో పాల కొరత తీరిపోయింది. పాడి ఉత్పత్తులపై మన పరాధీనత తొలగిపోయింది. భారత్ ఇప్పుడు పాడి ఉత్పత్తులలో ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. ఈ ఆహారోత్పత్తి విజయాలతో ప్రజల్లో,



ముఖ్యంగా బాలల్లో పోషకాహార లోపం గణనీయంగా తగ్గింది.

మన విజయగాథలో ఇవాళ నీలి విప్లవం మరో ఉజ్వల అధ్యాయంగా నిలుస్తోంది. ప్రకృతి మాత కరుణతో మన దేశానికి 11,000 కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతం సమకూరింది. ప్రాచీన కాలం నుంచీ సముద్రయానం, విదేశీ వాణిజ్యంలో మనకొక సుసంపన్న సంప్రదాయం కూడా ఉంది. అలాగే, మనకు మన భూభాగాల పరివేష్ఠిత సముద్రాలలో దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్) కూడా ఉంది. సముద్ర సంపదపరంగానూ ప్రపంచంలో భారత్ కీలక స్థానంలో నిలుస్తోంది.

ప్రధాని మోదీ ప్రభుత్వం 2019లో మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వశాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఆ విధంగా మత్స్య రంగం తొలిసారి ఒక మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ''మన జాతీయ పతాకంలోని నీలి చక్రం 'నీలి విప్లవం' అంటే సముద్ర ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది'' అని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత మత్స్య జల సాగు రంగం (ఆక్వా కల్చర్/ ఫిషరీస్ సెక్టార్) గడచిన దశాబ్ద కాలంలో మన ఆర్థిక వ్యవస్థలో ఒక వాస్తవిక ఉషోదయ రంగంగా ఆవిర్భవించింది. అంతర్జాతీయంగా చేపల ఉత్పత్తిలో సుమారు 8 శాతం వాటాతో మన దేశం నేడు రెండో స్థానంలో ఉంది. ఇంచుమించు 3 కోట్ల మంది జాలర్లు, చేపల పెంపకందారుల జీవనోపాధికి ఇప్పుడిది ఒక పెద్ద ఆసరాగా ఉంది. అంతేకాకుండా దేశంలో ఆహార భద్రతకూ ఈ రంగం గణనీయంగా దోహదం చేస్తోంది. 2024-25లో మన చేపల ఉత్పత్తి సామర్థ్యం 195 లక్షల టన్నుల స్థాయిని మించిపోయింది. ఈ భారీ ఉత్పత్తి మత్స్య రంగం అద్భుత పురోగమనాన్ని స్పష్టం చేస్తోంది.

మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇటీవల ఒడిషాలో, లక్షదీవులలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు నేను హాజరయ్యాను. వీటిలో మొదటిది- సముద్రపు లోతుల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, భారత పతాకం గల నౌకలకు అధికార పత్రాల ప్రదానానికి ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం. రెండోది- మత్స్య రంగంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమం. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాలను నిర్వహించడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. సముద్ర మత్స్య పరిశ్రమలో వృద్ధి, సుస్థిరత, సౌభాగ్య సహిత నవశకం వైపు పయనించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు, మన మత్స్యకార సంఘాల సమష్టి సంకల్పాన్ని ఆ కార్యక్రమాలు ప్రతిబింబించాయి. బాధ్యతాయుత చేపల వేట పద్ధతులు మన దేశ భవిష్యత్తుకు కచ్చితంగా విలువైన మూలధనమేనని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. నేను ఉపరాష్ట్రపతిగా గత నెలలో లక్ష దీవులలో తొలిసారి పర్యటించాను. ఆ సందర్భంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అక్కడ అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిసి చాలా ఆనందించాను.

గత ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కూడా మన 'ఈఈజడ్' పరిధిలోని జలాల్లో నిబిడీకృత సామర్థ్యం సద్వినియోగం కాకపోవడాన్ని గుర్తించింది. దీని పరిధితోపాటు అంతర్జాతీయ జలాల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగం దిశగా ఒక ప్రగతిశీల విధాన చట్రాన్ని ప్రకటించింది. ఈ కొత్త సరిహద్దుల్లో మన మత్స్యకారులు ధైర్యంగా వేటాడేందుకు ఈ కొత్త విధాన చట్రం తోడ్పడుతుంది.

మన మత్స్యకారులకు ఈ కొత్త చట్రం ఎనలేని ప్రాధాన్యమివ్వడం నాకెంతో ఆనందదాయకంగా ఉంది. 'ఈఈజడ్'లో మత్స్య రంగంపై రూపొందించిన నిబంధనలు, అంతర్జాతీయ జలాల్లో వేటకు సంబంధించిన 2025 నాటి మార్గదర్శకాలు మన మాతృభూమి భారత్‌కు ఓ శుభారంభాన్ని సూచిస్తున్నాయి. ఈ మేరకు మత్స్యకారుల సహకార సంఘాలు, చేపల పెంపకందారులు, ఉత్పత్తిదారు సంస్థలు, భారతీయ మత్స్యకారులకు అధికార పత్రాల జారీలో దీనికింద ప్రాధాన్యం ఉంటుంది. అలాగే, సుమారు 32 చదరపు కిలోమీటర్ల భూభాగం గల లక్షద్వీప్‌కు దాదాపు 145 కిలోమీటర్ల తీరరేఖ, సుమారు 4,200 చదరపు కిలోమీటర్ల మడుగు ప్రాంతం ఉన్నాయి. అంతేగాక 20,000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరిత ప్రాదేశిక జలాలు, సుమారు 4 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం కూడా ఉన్నాయి. అంటే భారత 'ఈఈజడ్'లో దాదాపు ఆరో వంతు లక్షదీవులలోనే ఉంది. ఇదే మన నిజమైన సాగర సామర్థ్యం. ఇప్పుడు ఇదొక శక్తిమంతమైన సందేశాన్నిస్తోంది: వ్యష్టిగా పనిచేస్తే వ్యక్తి ముందడుగు వేస్తాడు, అయితే అందరూ ఒక్కటై సమష్టిగా కృషి చేస్తే ఒక పరిణామాత్మక మార్పును తేగలరు.

భారత సముద్ర ఆహారం నేడు 120కి పైగా దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరంలోనే మత్స్యరంగం ఎగుమతులు రూ.73,000 కోట్ల మేర అద్భుత స్థాయికి చేరాయి. దీన్ని 2013-14 నాటి గణాంకాలతో పోలిస్తే 140 శాతానికి పైగా పెరుగుదలను సూచిస్తుంది.

ప్రపంచ అగ్రగామి మార్కెట్లలో భారత సముద్రపు ఆహారానికి మరింత ఆదరణను సముపార్జించడంలో డిజిటల్ ప్రామాణీకరణ వ్యవస్థలు, నౌకల పర్యవేక్షణ, అంతర్జాతీయ ధ్రువీకరణ, ఇతర చర్యలు ఎంతగానో తోడ్పడతాయి. ప్రగతి పథంలో పయనించేటప్పుడు మనం ప్రకృతి పట్ల మన బాధ్యతను ఎన్నడూ మరువరాదు. సముద్రం వేల ఏళ్లుగా మానవాళిని పోషిస్తోంది. దాన్ని మరిన్ని వేల ఏళ్లపాటు పరిరక్షించడం మన పవిత్ర కర్తవ్యం. కాబట్టి, సుస్థిర చేపల వేట మనకొక నైతిక బాధ్యత. ఈ దిశగా మంత్రిత్వశాఖ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు ఒక ముందంజ. పరిరక్షణ చర్యల అమలు, చట్టవిరుద్ధ, నియంత్రణ రహిత చేపల వేటపై కఠిన వైఖరి అవశ్యమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. లోతైన జలాలు, అంతర్జాతీయ జలాల్లోని మత్స్య సంపద మనకు చేపల వేటలోనే కాకుండా ప్రాసెసింగ్, శీతల గిడ్డంగులు, రవాణా, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, ఎగుమతి సేవలలోనూ ఉపాధిని సృష్టించగలదు. తద్వారా మన యువతకు అపార అవకాశాలు అందివస్తాయి. ముఖ్యంగా ప్రాసెసింగ్, విలువ జోడింపులో మహిళలకు అధిక భాగస్వామ్యం లభిస్తుంది. దీంతో భారత తీరప్రాంతాల ఆర్థిక జీవనం మరింత బలోపేతం అవుతుంది.

2047 నాటికి వికసిత భారత్ సంకల్ప సాకారం దిశగా దేశం పయనిస్తున్న నేపథ్యంలో నీలి ఆర్థిక వ్యవస్థను సుసంపన్నమైనదిగా, సార్వజనీనమైనదిగా, సుస్థిరమైనదిగా తీర్చిదిద్దడానికి మనం కట్టుబడి ఉన్నాం. ఈ నీలి విప్లవ పథంలో ప్రతి రంగానికి తనదైన పాత్ర ఉంటుంది. ఆ మేరకు మత్స్యకార సంఘాలు జాతీయ నీలి ఆర్థిక వ్యవస్థకు సారథ్యం వహిస్తాయి. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో మత్స్య మంత్రిత్వశాఖ ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయం. నీలి విప్లవం ద్వారా వృద్ధి, సుస్థిరత, సౌభాగ్య సహిత నవశకం వైపు అది గణనీయ ప్రగతి సాధిస్తోంది. చేపల వేటను వారసత్వ వృత్తిగా మాత్రమేగాక విజ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణలు సహా అంతర్జాతీయ అవకాశాల వైపు నడిపించే ఒక ఆధునిక వృత్తిగా పరిగణించాలని ఈ సందర్భంగా యువతకు సూచిస్తున్నాను. అలాగే, మన మత్స్యకార సమాజానికి జ్ఞానం, సాంకేతికత, ఆర్థిక సహాయం ద్వారా చేయూతను కొనసాగించాలని నేను మన సంస్థలను కోరుతున్నాను. ఆత్మవిశ్వాసంతో ముందడుగువేస్తూ సమష్టిగా మరింత శక్తిమంతమైన తీరప్రాంత మాతృభారతాన్ని ఆవిష్కరిద్దాం. సదా మాతృభూమి సేవలో...!

# ఏఐపై నియంత్రణ అత్యావసరం

**జనజీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే నాయకులు- వర్తమాన ప్రపంచ పరిణామాలను గమనిస్తూ, రాబోయే రోజుల్లో మానవాళికి ఎదురయ్యే సవాళ్లను గుర్తించగలగాలి. ఆయా రంగాల నిపుణులతో చర్చించి వాటి లోతుపాతులను అర్థంచేసుకోవాలి. ముప్పు మన ముంగిట్లోకి వచ్చేసేదాకా కాలహరణం చేయకుండా ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ముందు నుంచే తగిన విధంగా సంసిద్ధం కావాలి. సంకుచిత ప్రయోజనాలు, తాత్కాలిక ఆర్థిక లాభాలకోసం వెంపర్లాడకుండా ప్రజానీకానికి దీర్ఘకాలంలో శ్రేయోదాయకమయ్యే విధానాలనే అనుసరించాలి. అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్‌లో ఇంతటి రాజనీతిజ్ఞత ఉందా అంటే, ఏమో అనుమానమే! నానాటికీ పెరిగిపోతున్న భూఉష్ణోగ్రతలు అనేక విపరిణామాలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నప్పటికీ ట్రంప్ ఆలకించట్లేదు. పర్యావరణ మార్పులనేవి బూటకమంటూ కొట్టిపారేసిన ఆయన పారిస్ వాతావరణ ఒప్పందంలోంచి**



**అమెరికాను వెనక్కి లాక్కొచ్చేవరకు నిద్రపోలేదు. ప్రస్తుతం ఏఐ విషయంలోనూ ట్రంప్ తనకు అలవాటైన మొండి వాదనలే చేస్తున్నారు. కృత్రిమమేధతో పొంచి ఉన్న ప్రమాదాలను భూతాపం వంటి ప్రధాన సమస్యల మాదిరిగానే పరిగణించి ప్రపంచం ప్రతిస్పందించాలని ఏఐ కంపెనీల బాధ్యులే ఒకపక్కన చెవినిల్లు కట్టుకుని పోరుతున్నారు. అలాంటి హెచ్చరికలను తేలిగ్గా తీసిపారేస్తూ, సాంకేతికతను నియంత్రించడం దుర్మార్గమని తీర్మానిస్తున్న ట్రంప్ పోకడలు భస్మాసుర వృత్తాంతాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయి!**

అనూహ్య రీతిలో సామర్థ్యాలను పెంచుకుంటున్న కృత్రిమమేధకు ఇప్పుడు కళ్లెం వేయకపోతే భవిష్యత్తులో పరిస్థితులు పూర్తిగా మన చేజారిపోతాయని ఆంత్రోపిక్ సీఈవో దారియో అమెడాయ్ హెచ్చరిస్తున్నారు. చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఎలాన్ మస్క్ వంటివారు సైతం అదే విధంగా హితవు పలుకుతున్నారు. ఇలాంటి అభిప్రాయాలను ప్రతికూల శక్తుల దుష్ప్రచారంగా అభివర్ణిస్తున్న ట్రంప్ 'ఏఐలో ఎవరు గెలిస్తే వారే అంతిమ విజేతలు' అని బల్లగుద్ది చెబుతున్నారు. ఏఐను భౌగోళిక రాజకీయ పరపతిని పెంచే సాధనంగా, వ్యూహాత్మక ఆధిపత్యాన్ని అందించే ఆయుధంగా భావిస్తున్న ఆయన వీలైనంత తక్కువ నియంత్రణలతో కొత్త మోడళ్లను వేగంగా నిర్మించి ఆ అత్యాధునిక సాంకేతికతలో చైనాకు మించి పట్టుసాధించాలని తలపోస్తున్నారు. ట్రంప్ ఆశిస్తున్న విజయానికి ప్రతిగా ఆర్థిక, సామాజిక, సైనిక, సైబర్ భద్రతా రంగాల్లో ప్రపంచం ఎంతటి మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందన్నదే నేడు అందరినీ కలవరపరుస్తోంది!

నిత్యం తననుతాను మెరుగుపరచుకుంటున్న ఏఐ స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలను సృష్టించి, ఇంటర్‌నెట్ మొత్తాన్నీ స్వాధీనం చేసుకోగలిగిన స్థాయికి అతిత్వరలోనే ఎదగబోతోందని నిపుణులు పేర్కొంటున్నారు. తగిన భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోకపోతే సైబర్ దాడులు పెచ్చుమీరతాయని, సున్నిత సమాచారానికి రక్షణ ఉండదని వారు స్పష్టంచేస్తున్నారు. మోసపూరిత విధానాలను అనుసరించైనా సరే, లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్న కొన్ని ఏఐ మోడళ్ల విపరీత ప్రవర్తన గురించి ఇప్పటికే కథనాలు వెలువడుతున్నాయి. నిబంధనలు, నైతికతతో నిమిత్తం లేకుండా వ్యవహరించే కృత్రిమమేధ నమూనాల నిర్మాణాన్ని నియంత్రించాల్సిన అవసరాన్ని అవి గుర్తుచేస్తున్నాయి. ఇండియా పిలుపిస్తున్నట్లుగా బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి ప్రపంచ దేశాలు కట్టుబడాల్సిన కీలక తరుణమిది. ముఖ్యంగా అమెరికా, చైనాలే ఇందుకు బాధ్యత తీసుకోవాలి. ఉమ్మడి నియంత్రణలతో కృత్రిమమేధను సురక్షితం చేయాలి. సమ్మిళిత ప్రగతికి దాన్ని సద్వినియోగపరచాలి!

# 'నూరుశాతం' తప్పుడు చర్య

**తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది.**

**రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించ దల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు.**

తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ 'తన చావు జగత్ప్రళయమ'న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమోక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు.

మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది. అసలు ఈ తీర్మానం చేసే నైతిక హక్కు అమెరికన్ కాంగ్రెస్‌కు ఉందా? ఈ ఆంక్షలు ఒక్కరోజు ఆలస్యమైనా ఉక్రెయిన్‌లో మరింత మంది ప్రజలు మృత్యువుకు బలి అవుతారని తీర్మానం చెప్పడం వంచన. ఈ సూత్రం తనకు వర్తించదా? ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాగించిన దురాగతాలను నిలువరించకపోగా, తానూ అందులో పాలుపంచుకుని దేశాధినేతతోసహా అనేకమంది పౌర, సైనిక ముఖ్యుల్ని హతమార్చటం... ఇప్పటికీ పౌర ప్రాంతాలపై బాంబులేస్తూ పదులకొద్దీ మందిని నిత్యం హతమార్చటాన్ని కాంగ్రెస్ ఎలా చూస్తుంది? తీర్మానం చేసేముందు తమ పాలకుడి నిర్వాక మేమిటన్న స్పృహ ఉండొద్దా? తాము అధర్మయుద్ధం కొనసాగిస్తూ ధర్మపన్నాలు వల్లించటం, వేరొకరిని వేలెత్తిచూపటం, అందరూ తననే అనుసరించాలనటం ఏం సబబు?

వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా సందర్శనకు రాబోతున్నారు. ఇరు దేశాలమధ్యా శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. ఇలాంటి సమయంలో ఆంక్షల తీర్మానం తీసుకురావటం, బెదిరింపులకు దిగటం తెలివిమాలిన చర్యగా అమెరికా గుర్తించకపోవటం ఆశ్చర్యకరం. ఇప్పటికే ఏఐ విషయంలో సమష్టిగా కదలాలన్న అమెరికా ప్రతిపాదనను చైనా తోసిపుచ్చింది. ఆ విషయంలో ఇరు దేశాలమధ్యా భిన్నాభిప్రాయాలున్నాయని బయటపడింది. ఈ నేపథ్యంలో మరో వివాదాన్ని రగల్చటం వల్ల ఒరిగేదేమిటి? తన పెత్తందారీ పోకడలతో విసిగిన ప్రపంచం ఇప్పటికే దూరం జరిగిందని అమెరికా గ్రహించటం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడటంలో తెరవెనక తాను నడిపించిన ఎత్తుగడలే కారణమని గుర్తులేదా? అంతర్జాతీయ వేదికల ప్రమేయం లేకుండా ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేవటం చట్టవిరుద్ధమని అమెరికా తెలుసుకోవాలి.



## వినాయక చవితి సందర్భంగా మండపర్తిలో ఘనంగా అన్నదానం

**అనంతగిరి, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

వినాయక చవితి సందర్భంగా అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ పరిధిలోని మండపర్తి గ్రామంలో టి.ఆర్. హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పండుగ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించడం ద్వారా నిర్వాహకులు సేవాభావాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ అనంతగిరి మండల చైర్మన్ పాటి రవి కుమార్, వైస్ చైర్మన్ దారపి దుక్కు, ఉమెన్ వింగ్ చైర్మన్ కోర దారమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గ్రామస్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.




## రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి
# ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి కందుల దుర్గేష్
- విజయవాడలో ఘనంగా మహాకవి బోయి భీమన్న జయంతి ఉత్సవాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ
- అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత భూసురపల్లి వెంకటేశ్వర్లుకు 'బోయి భీమన్న అవార్డు-2026' ప్రదానం..రూ. 2 లక్షల పారితోషికం అందజేసిన మంత్రి దుర్గేష్
- అర్హులైన కళాకారులందరికీ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే ఐడీ కార్డులు అందిస్తాం: మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరం తెలుగు వర్సిటీకి 'బోయి భీమన్న కళాపీఠం' తరలింపుకు చర్యలు: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**




ఏపీలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.. శనివారం ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న గారి జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన మంత్రివర్యులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమ ప్రారంభంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోయి భీమన్న జీవిత ఛాయాచిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అనంతరం వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి, బోయి భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.వేడుకలో భాగంగా లో గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుని 'బోయి భీమన్న అవార్డు2026'తో పురస్కరించారు. ఆయనకు జ్ఞాపిక, శాలువాతో పాటు రూ. 2,00,000 నగదు పారితోషికం చెక్కును మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..

"మహాకవి బోయి భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా అమరుడయ్యారు, ప్రాతఃస్మరణీయుడిగా నిలిచారు. ఆయన కవితాధోరణికి, ఉదాత్త భావజాలానికి నిజమైన అర్థాంగి, సర్వస్వం ఆయన సతీమణి హైమావతి. భీమన్న రచనలు సమాజంలో ఎంతో స్పృహను, చైతన్యాన్ని రగిలించాయి.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూర్తిగా కట్టుబడి ఉంది. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతాం. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భీమన్న కళాపీఠాన్ని ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటాం. సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ తో మాట్లాడి అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు ఇప్పిస్తాం అన్నారు.. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ పనితీరును శ్రీకృష్ణదేవరాయల భువనవిజయంలోని అష్టదిగ్గజాలతో పోల్చవచ్చని మంత్రి దుర్గేష్ చమత్కరించారు. బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి మాట్లాడుతూ.. భీమన్న జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి దుర్గేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ ప్రసంగ శైలిని, వాగ్ధాటిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు.రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. బోయి భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, సమాజ శ్రేయస్సు కోరిన ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి ఆవగాహన చేసుకోవాలని సూచించారు.అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..

విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, బోయి భీమన్నలను త్రిమూర్తులుగా, మహాకవులుగా కీర్తించారు. ఈ ముగ్గురూ పద్మ పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. కవితా ప్రపంచాన్ని ఏలిన భీమన్న పేరిట తనకు అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. భీమన్న సతీమణి హైమావతి కృషి వల్లే ఆయనకు ఈ గౌరవం ప్రతీ ఏటా దక్కుతోందని పేర్కొన్నారు.మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు మాట్లాడుతూ..

సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత అంతటి కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి మంత్రి కందుల దుర్గేష్ అని కొనియాడారు.సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసి నైతిక, సామాజిక విలువలు పెంచిన బోయి భీమన్న కళాపీఠాన్ని ఏపీకి తీసుకువచ్చి, ఆయన సాహిత్యాన్ని పుస్తక రూపంలో ముద్రించాలని కోరారు.సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ సాంస్కృతిక పునరుజ్జీవనం వచ్చిందంటే అది మంత్రి దుర్గేష్ చొరవే అని కొనియాడారు. భీమన్న రాసిన 'పాలేరు', 'గూడు కాలిపోతుంది' వంటి రచనలు దళితుల జీవితాల్లో వెలుగులు నింపి చైతన్యపరిచాయని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, వారి కుటుంబ సభ్యులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, అధికారులు సుమన్, శ్రీనివాస్, పలువురు ప్రముఖ రచయితలు, కవులు మరియు కళాకారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్టోబర్ 23న అనంతపురంలో
# సీఐఐ భాగస్వామ్య సదస్సు



- ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి: ఏపీ ఈడీబీ సీఈఓ సగిలి షణ్మోహన్, కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో అక్టోబర్ 23న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏపీ ఈడీబీ సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు.శనివారం జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, జేఎన్టీయూ అతిథి గృహాన్ని వారు పరిశీలించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఉన్నతాధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.ఆడిటోరియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పిచ్చిమొక్కలను ముందుగానే తొలగించాలని, కార్యక్రమ ప్రాంగణం ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సీఈఓ సూచించారు. అతిథి గృహం, ఇన్నోవేషన్ హబ్ తదితర ప్రాంతాల్లోనూ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ ప్రాంతీయ సదస్సులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, సీనియర్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొననున్నారు. జిల్లాలోని ప్రాధాన్యత రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించడం, పెట్టుబడి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం, స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను జాతీయ, అంతర్జాతీయ భాగస్వాములతో అనుసంధానించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఏపీ ఈడీబీ మేనేజర్ అనంత్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, జేఎన్టీయూ వీసీ సుదర్శన్‌రావు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీవో ప్రేమంతకుమార్, తహసీల్దార్ రాజా, నెడ్‌క్యాప్ మేనేజర్ కిరణ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇన్‌చార్జి ఉద్యాన జిల్లా అధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, భూ సమస్యలపై
# ఎమ్మెల్యే పరిటాల సునీత ఫోకస్



- తన దృష్టికి వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశం
- క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీత ప్రజా దర్బార్
- రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి రూ.1.50లక్షల సాయం

**అనంతపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

గ్రామాల్లో విద్యుత్, భూ సమస్యలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు ఓపిగ్గా విన్నారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ రాజ్, పింఛన్లు వంటి వాటి మీద అర్జీలు వచ్చాయి. కొన్ని చోట్ల విద్యుత్ సమస్య ఉందని చెప్పడంతో వెంటనే అధికారులతో మాట్లాడారు. అసలే నీరు తక్కువగా ఉందని.. వ్యవసాయానికి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమస్య తెలిసిన వెంటనే విద్యుత్ సిబ్బంది స్పదించాలన్నారు. భూముల సమస్యలపై కూడా ఎమ్మెల్యే సునీత ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. కింది స్థాయిలో పరిష్కరించదగ్గ వాటిపై కూడా నిర్లక్ష్యం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏ విభాగంలో సమస్య పరిష్కారమవుతుందనేది చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలన్నింటికీ పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో రెవెన్యూ, విద్యుత్ సమస్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలిస్తున్నట్టు చెప్పారు. ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా చేస్తున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పింఛన్ల చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు..



**రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి సాయం**

రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే సునీత చొరవతో ఆర్థిక సాయం అందింది. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన జి.సుధాకర్ రెడ్డి నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సునీత సీఎం చంద్రబాబు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. వారి కుటుంబ పరిస్థితి వివరించగా.. వారు తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1లక్ష 50వేల రూపాయలను మంజూరు చేశారు. శనివారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో సుధాకర్ రెడ్డి సతీమణి రాణికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత కృతజ్ఞతలు తెలిపారు...

## మానవత్వం చాటుకున్న
# ఎమ్మెల్యే దగ్గుపాటి

- చిన్నారి అశ్వర్థ గుణదత్తకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి
- ఒక నెల వేతనానికి సంబంధించిన చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**అనంతపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

అరుదైన వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల అశ్వర్థ గుణదత్తకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన నెల రోజుల వేతనాన్ని సాయంగా అందజేశారు. కర్నూలు జిల్లాకు చెందిన హరీష్ కుమార్, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు సంతానం కాగా పెద్దకుమారుడు అశ్వర్థ గుణదత్త(3)కు జన్యుపరఅరుదైన వ్యాధి సోకింది. ఈ వ్యాధి కారణంగా కండరాలు బలహీనమై నిల్చోలేని, కూర్చోలేని పరిస్థితి. ఖరీదైన ఇంజెక్షన్ వేయించాలని, లేకపోతే చిన్నారికి ఇవ్వకపోతే ప్రాణానికే ప్రమాదం అని వైద్యులు తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గతంలోనే స్పందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు నెల జీతం అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శనివారం రోజు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆ చిన్నారి తాతయ్య పుల్లయ్యకు తన నెల రోజుల వేతనానికి సంబంధించిన చెక్కును అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. భవిష్యత్ ఆ చిన్నారికి మరింత సాయం అందేలా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు.




# పోషక ఆహారం వల్లనే ఆరోగ్యమైన బాల్యం..

- తండాలో పోషణ మాసోత్సవ అవగాహన కార్యక్రమం ...

**ఉరవకొండ, సెప్టెంబర్19,అనంత జనశక్తి న్యూస్**

పౌష్టిక ఆహారం వల్లనే ఆరోగ్యమైన బాల్యం సాధ్యమవుతుందని అలాగే తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారని, ఉరవకొండ సిడిపిఓ డా. బి.యన్. శ్రీదేవి, ఎంపి డి ఓ రవి కుమార్ పేర్కొన్నారు.

శనివారం ఉదయం ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం తండాలో 9వ జాతీయ పోషణ మాసవత్సవ అవగాహన కార్యక్రమం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలోని పిల్లల తల్లులకు, గర్భిణీ స్త్రీలకు మరియు బాలింతలకు

పోషణ మాసం కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశాన్ని సిడిపిఓ వివరించారు. అలాగే పవర్ పాయింట్ ప్రజెంటేషన్, మంచి పోషక ఆహారం వాడకం గురించి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలు పప్పు దినుసులు, పండ్లు తదితరములతో స్టాల్ ఏర్పాటు చేసి పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా తల్లి బిడ్డ సురక్షితంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు పండ్లు, ప్రతి కుటుంబంలోని ఇంటిలో వండిన పిండి వండిన పిండి పదార్థాలు తినాలని సూచించారు.

0.6 సంవత్సరపు పిల్లలు, గర్భవతులు, బాలింతలు ఆకుకూరలు బాగా తీసుకోవాలన్నారు.

చిన్నారులకు చిన్న వయసులోనే మంచి ప్రోటీన్ ఉన్న ఆహారం తినిపించాలని తద్వారా పిల్లలు పెరిగి పెద్దవారైన తర్వాత కూడా అన్ని ఆహార పదార్థాలకు అలవాటు పడతారన్నారు. తల్లుల పిల్లల పోషణ ఆహారంలో వైవిధ్యం ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తదితర వాటిపై అవగాహన కల్పించుపోవాలని సూచించారు.ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం మరియు సరైన ఆరోగ్య రక్షణ కోసం ఈ కార్యక్రమంను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9 నుండి వచ్చే నెల 8 వరకు ప్రతిరోజు వైవిధ్యంప్రతి ముద్దలో పోషణ అనే నినాదంతో జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం మొత్తం ఆరోగ్యకరమైన వంటకాలు స్థానిక ఆహార కొత్త రుచులపై అవగాహన పెంచుకోవాలని తద్వారా అంగన్వాడి కేంద్రంలోని బాలల భవిష్యత్తుకు పోషకమైన ఆహారం వారి ప్రగతికి దోహదపడు తుందన్నారు. ప్రతిరోజు అంగన్వాడి కేంద్రాలలో తాజాగా వేడిగా వండిన ఆహారాన్ని మెను ప్రకారం పిల్లలకు అందించడం జరుగుతుందని అందువల్ల ప్రతి బిడ్డను తప్పకుండా అంగన్వాడికి పంపించాలని, ఎంపీడీవో మరియు సిడిపిఓ కోరారు. ప్రస్తుతం ఈ పోషన్ మాసం కార్యక్రమంలో భాగంగా పౌష్టిక ఆహారం, ఆరోగ్యం, బాలల వికాసం, సమాజ భాగస్వామ్యంతో మన అంగన్వాడి మన బాధ్యత అనే నినాదంతో కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, వంటల పోటీలు పౌష్టికి ఆహార ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు బాలింతలు మరియు కిషోర్ బాలికలకు పోషకాహారం యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ అందరి చేత పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం అంగన్వాడీలో ఏర్పాటుచేసిన ప్రజా సమాచార బోర్డ్ అదనపుపోషకాహార కార్యక్రమాల అమలు పనితీరుపై ఆరా తీశారు అలాగే పిల్లలకు వారపు మెనూ చార్టును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి ప్రచార విభాగం ఎపిఆర్ఓ ఫక్రుద్దీన్, పంచాయతీ సెక్రెటరీ శోభన్ బాబు, ఉపాధ్యాయుడు నాగభూషణం, స్థానిక నాయకులు నారాయణస్వామి నాయక్, అంగన్వాడి మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుణ, శ్వేత, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మమ్మ, రబియా, నాగవేణి, సువర్ణమ్మ, ఎఎన్ఎం చంద్రకళ, ఎంఎస్కే రాజేశ్వరి, పలువురుగ్రామ పెద్దలు, గిరిజన తాండ కాలనీ ప్రజలు తదితరులు కార్యక్ర మంలో పాల్గొన్నారు.



## మంత్రి నారా లోకేష్ పర్యటనపై గ్రామ గ్రామాన చర్చ



- ప్రతి గ్రామం నుంచి తరలివచ్చేలా శ్రేణులు సన్నాహకాలు
- లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దామన్న పరిటాల సునీత

అనంతపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాప్తాడు నియోజకవర్గ పర్యటనపై గ్రామ గ్రామాన చర్చ మొదలైంది. లోకేష్ పర్యటనకు తరలివచ్చేలా టీడీపీ శ్రేణులు భారీగా సన్నాహకాలు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం రూరల్, ఆత్మకూరు మండల నేతలతో సమావేశం నిర్వహించారు.అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 22న మంత్రి లోకేష్ పర్యటనకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే సునీత వివరించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని.. నాయకులు ఎమ్మెల్యేతో అన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ తో పాటు పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ ఉండటంతో చాలా మందిలో ఆసక్తి ఏర్పడిందన్నారు. ఆ కార్యక్రమం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ పర్యటనకు ఎంత మంది వచ్చినా అందుకు తగిన విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యకర్తలను గ్రామం నుంచి తీసుకొచ్చి.. తిరిగి వారు ఇంటికి చేరే వరకు నాయకులే బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎంత బలంగా ఉందనేది.. ఈ పర్యటన ద్వారా తెలియజేద్దామని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## ఆర్టీసీ విశ్రాంతి కేంద్రం స్థలం ఆక్రమణ



అనంతగిరి, సెప్టెంబర్ 19,అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ కేంద్రం వద్ద అరకు-ఎస్.కోట ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆర్టీసీ ప్రయాణికుల విశ్రాంతి కేంద్రం ఎదుటి స్థలం ఆక్రమణకు గురవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విశ్రాంతి కేంద్రం ఎదుటి స్థలాన్ని కొందరు వ్యక్తులు వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు కూర్చోవడానికి, నిలబడేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.అక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తిస్తూ,దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి కేంద్రం వద్ద ఈ పరిస్థితులు నెలకొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆర్టీసీ, ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి, నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పినకోట క్లస్టర్‌లో బ్యాంకు లింకేజీ డ్రైవ్




- మూడు స్వయం సహాయక సంఘాలకు రూ.30 లక్షల రుణం

అనంతగిరి, సెప్టెంబర్ 19, అనంత జన శక్తి న్యూస్:

అనంతగిరి మండలం పినకోట క్లస్టర్ పరిధిలోని చింతపాక గ్రామ సంఘం వద్ద యూకో బ్యాంకు దేవరాపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా మూడు స్వయం సహాయక సంఘాలకు చెందిన 30 మందికి పైగా మహిళా సభ్యుల రుణ దరఖాస్తులు, పత్రాలను బ్యాంకు అధికారులు పరిశీలించి వెరిఫికేషన్ చేపట్టారు. సంఘాల పొదుపు, ఆర్థిక కార్యకలాపాలు, బ్యాంకు లావాదేవీలను పరిశీలించారు.వెరిఫికేషన్ అనంతరం మూడు స్వయం సహాయక సంఘాలకు కలిపి రూ.30 లక్షల బ్యాంకు లింకేజీ రుణం అందించేందుకు అధికారులు అంగీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. రుణంతో మహిళా సంఘాల సభ్యులు తమ జీవనోపాధి, ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో యూకో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, వీఓఏ శ్రీదేవి, సీసీ సోమేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం:

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, సెప్టెంబర్ 19: అనంత జనశక్తి న్యూస్

“ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగ్‌లు ముద్దు” అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు గౌ. శ్రీ కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.కదిరి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఎదురుగా నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్‌లు, పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు.“మన ఆరోగ్యం.. మన పర్యావరణం.. మన బాధ్యత” అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కదిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు, అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.స్వచ్ఛమైన కదిరి.. ఆరోగ్యకరమైన కదిరి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు



## ఇకపై మారుమూలన ఉన్న
# ఇంటి వరకు చెత్త బండి వస్తుంది

- ప్రజలు సహకరిస్తేనే.. స్వచ్ఛ అనంత సాధ్యం.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఈ-ఆటోలు ప్రారంభం
- వైసీపీ రాష్ట్రాన్ని చెత్తమయం చేసిందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- ప్రతి డివిజన్ కు ఒక ఈ-వాహనం ఉంటుందన్న ఎమ్మెల్యే
- దేశంలో ఏది చేసినా అది ఏపీ నుంచే ప్రారంభమవుతుందన్న ఎంపీ అంబికా



అనంతపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఇక నుంచి నగరంలో మారుమూలన ఉన్న ఇంటి వరకు చెత్త తరలించే ఎలక్ట్రానిక్ వాహనాలు వస్తాయని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించిన ఈఆటోలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్, ఎంహెచ్ఓ రాజా రవీంద్ర చౌదరితో పాటు మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థకు మొత్తం 62 వాహనాలను ప్రభుత్వం కేటాయించగా.. తొలి విడతగా 15 వాహనాలు వచ్చాయి. వీటిని ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనతో కాలుష్య రహిత చెత్త వాహనాలను తీసుకొచ్చారన్నారు. ఈవాహనాల ద్వారా నగరంలో చిన్న చిన్న సందుల్లో కూడా వెళ్లే సౌలభ్యం ఉంటుందన్నారు. ప్రజలంతా సహకరించి ఈవాహనాలకు చెత్త అందజేయాలని కోరారు .గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కోటి 50లక్షల టన్నుల చెత్తను పెట్టి పోయిందని విమర్శలు చేశారు. దీనిని తొలగించేందుకు గత అక్టోబర్ రెండవ తేదీ నుంచి చర్యలు చేపట్టారని.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల చెత్త నిలువలు లేకుండా చేశారన్నారు. అనంతపురం నగరంలో డంపింగ్ యార్డ్ లో మూడు లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారని.. ఇప్పటికి రెండు లక్షల టన్నుల చెత్తను తొలగించామని.. త్వరలోనే మిగిలింది కూడా పూర్తి చేస్తామన్నారు. ఇదే స్థానంలో 15 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తామని చెప్పారు. దీని ద్వారా తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా శుద్ధి చేసి.. ఎరువుగాను, సిమెంట్ పరిశ్రమలకు తరలించే విధంగా చూస్తామన్నారు. అదే సమయంలో ఇక్కడ ఒక అందమైన పార్కును కూడా తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో ప్రజా వ్యవస్థను మొత్తం నాశనం చేసి వెళ్లిపోయారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు తీసుకున్న తర్వాత అన్నింటిని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. వెనుకబడిన రాయలసీమను రైజింగ్ రాయలసీమగా మారుస్తూ ప్రాంతానికి అనుగుణంగా పరిశ్రమలు తీసుకొస్తున్నారని.. ఇప్పటికే నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను కూడా పూర్తి చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో ఏ కార్యక్రమైనా.. అది ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభమవుతుందని.. ముఖ్యమంత్రులు చంద్రబాబుకు ఉన్న విజన్ కు నిదర్శనమన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ కాలుష్యరహితంగా ఉండేవిధంగా ఎలక్ట్రానిక్ వాహనాలను తీసుకొచ్చారన్నారు. ఈవాహనాలు మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి చెత్త సేకరిస్తాయన్నారు.

ప్రజలంతా దీనికి సహకరించాలన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర పేరుతో ప్రతివారం వినూత్నమైన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి నెలరోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో అనంతపురం ఒక స్వచ్ఛమైన,సుందరమైన అనంతగా మారుతోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ డైరెక్టర్లు భవాని రవికుమార్, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, టిడిపి నగర అధ్యక్షులు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర'లో భాగంగా
# మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్



- 'గ్రీన్ స్పేస్' 'పబ్లిక్ టాయిలెట్' ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

మడకశిర,సెప్టెంబర్,19, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం మడకశిర నగర పంచాయతీ పరిధిలో పర్యటించారు.పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ మడకశిర నగర పంచాయతీ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద గ్రీన్ స్పేస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ పర్యటనలో భాగంగా పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'పబ్లిక్ టాయిలెట్' లను కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు, పట్టణాల ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కల పెంపకం ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను అధికారులు, మున్సిపల్ సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు.పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన ఈ సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అలాగే వీటి నిర్వహణను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మడకశిర మున్సిపల్ కమిషనర్,మడకశిర తహసీల్దార్ ముకుంద,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి,నగర పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది




- జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజ నాయుడు
- ఆత్మకూరులో ఘనంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ

అనంతపురం, సెప్టెంబర్ 19 : అనంత జనశక్తి న్యూస్

ఆత్మకూరు మండలం, ఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర శీతల ఆంధ్ర అనే థీమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజ నాయుడు, అనంతపురం డివిజనల్ పంచాయతీ అధికారి బి.శకుంతల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉప మండల అభివృద్ధి అధికారి, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి ఇంట్లో చెత్తను 4 రకాలుగా వేరు చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మొక్కలు నాటడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ను హరిత ఆంధ్రగా, శీతల ఆంధ్రగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అలాగే SWPC షెడ్ పరిధి లో మొక్కలు నాటడం జరిగింది. మరియు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నందు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ గురించి విద్యార్థులకు తెలియజేసారు. పరిశుభ్రతే సేవ(స్వచ్ఛత హి సేవ) కార్యక్రమంలో భాగంగా SWPC షెడ్ నుంచి ఎంపిడిఓ కార్యాలయం ఆత్మకూరు వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం SWPC కార్యకలాపాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కన్వేయర్ ద్వారా మిశ్రమ పొడి వ్యర్థాలను వేరు చేయడం, బేలింగ్ యంత్రం పనిచేయడం....ప్లాస్టిక్ వ్యర్థాలను నొక్కడం, ష్రెడ్డింగ్ యంత్రం ద్వారా ప్లాస్టిక్ పదార్థాన్ని చిన్న ముక్కలుగా చేయడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# రూ.1 కోటి సి ఎస్ ఆర్ నిధులతో రైతు బజార్ నిర్మాణం

- మొదటి దశలో 48 స్టాళ్లు.. రెండో దశలో 200 స్టాళ్ల ఏర్పాటు
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం : మంత్రి సవిత



పెనుకొండ సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

పట్టణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెనుకొండ మార్కెట్ సమీపంలో రూ.1 కోటి సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించనున్న రైతు బజార్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి శనివారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేలా, ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి దశలో 48 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామని, రెండో దశలో మరో 200 స్టాళ్లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పెనుకొండ పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. ఇళ్ల పట్టాల విషయంలో ఎన్నికలకు ముందే 1,500 మందికి పట్టాలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

# పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి

**- కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం**



**అనంతగిరి, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం పిలుపునిచ్చారు.అనంతగిరి మండల కేంద్రంలోని ఆర్ఆర్ఆర్ రిసార్ట్స్‌లో వైసీపీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, బూత్ కమిటీల బలోపేతం, నాయకులు-కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీపై సమావేశంలో చర్చించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారికి ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో కార్యకర్తలు, నాయకులకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తానన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు పథకాల్లో కోతలు విధిస్తోందని ఆరోపించారు. కొత్త పింఛన్లకు ఆంక్షలు విధించడం వల్ల అర్హులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అనంతరం నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ఐడీ కార్డులు పంపిణీ చేశారు.
ఈ ఐడీ కార్డులు పార్టీ గుర్తింపుతో పాటు రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యానికి ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర యువజన
ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, ఎంపీపీ టి.మితుల, మాజీ ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పరిశీలకుడు వై.సన్యాసిరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు స్వామి, ఫోరమ్ అధ్యక్షుడు పి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.డేనియల్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డి.గంగన్నదొర, బూత్ కమిటీ ఇన్‌చార్జ్ విజయ్ పాంగి, ఎంపీపీ డి
.జయవర్ధని, మండల ఉపాధ్యక్షుడు పాడి కృష్ణమూర్తి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రామ్, ఎంపీటీసీ వై.నవీన్, సర్పంచ్‌లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**- జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి**
**- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున**

**కళ్యాణదుర్గం: సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్**

కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. కరువును జాతీయ విపత్తుగా ప్రకటించడంతో పాటు అనంతపురం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు.
కరువు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 21, 22, 23 తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో సీపీఐ ఆధ్వర్యంలో కరువు దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం కళ్యాణదుర్గం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రాంబాబు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులుతో కలిసి మల్లికార్జున మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అన్ని రకాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, పంట నష్టపరిహారం అందించడంతో పాటు పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పశువులకు తగినన్ని పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఎలాంటి షరతులు లేకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో విద్యార్థుల అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు కరువు భృతి అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ఉచిత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు పశువులు, గొర్రెలు తదితర మూగజీవాలకు కూడా తాగునీటి వసతి




ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
కరువు సమస్యపై చేపట్టనున్న దీక్షలకు కలిసి వచ్చే ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని సీపీఐ నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో బ్రహ్మసముద్రం మండల కార్యదర్శి నాగరాజునాయక్, శెట్టూరు మండల కార్యదర్శి తిమ్మరాయుడు, పట్టణ కార్యదర్శి ఓంకార్, కళ్యాణదుర్గం మండల సహాయ కార్యదర్శులు వెంకటేశులు,శ్రీనివాసనాయక్, మహిళా సమాఖ్య తాలూకా కార్యదర్శి కవిత, నియోజకవర్గ సమితి సభ్యులు బీకే గోపాల్, జయరాములు, రామదాసు, ఈరన్న, నాగభూషణ, తిప్పేస్వామి, మంజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రజల వికాసానికి పల్లె ప్రత్యేక కృషి





**- పుట్టపర్తి నియోజవర్గ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ పల్లె రఘునాథ్ రెడ్డి**
**- ప్రజల అభివృద్ధికి నిత్య సేవకుడు.. పేదల ఆపదలో అండగా నిలిచే నేస్తం డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**
**- విద్యావేత్తగా ప్రస్థానం.. రాజకీయ నాయకుడిగా ప్రజాసేవ.. సినీ రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు**
**- భారీ జనసందోహం మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు.. పలు సేవా కార్యక్రమాలు**
**- జన్మదిన వేడుకలు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు**
**- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి, అభిమానాన్ని చాటుకున్నారు.పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం నిత్యం శ్రమించే పల్లె రఘునాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, ఘన స్వాగతం పలికారు.పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి సమక్షంలో డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కేక్ కట్ చేశారు. టీడీపీ శ్రేణులు 73 కిలోల భారీ కేక్ ఏర్పాటు చేసి, భారీ గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు.అనంతపురంలోని పల్లె నివాసంలో పల్లె సింధూర రెడ్డి, పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, వియ్యంకులు కేరళ మాజీ డీజీపీ శంకర్ రెడ్డి, సౌభాగ్యరాణి దంపతులు, మనవడు వియాన్, మనుమరాలు వన్షా తదితర కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.

**పేదలకు అండగా సేవా కార్యక్రమాలు**

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదినం సందర్భంగా కొత్తచెరువు షాదీఖానాలో 400 మందికి పైగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పుట్టపర్తి సాయి ఆరామంలో 650 మందికి పైగా కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

**ఆపదలో నేనున్నానంటూ అండగా నిలిచే నేస్తం పల్లెన్న**

ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ఉన్నానంటూ భరోసా కల్పించడం డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సేవా తత్వానికి నిదర్శనమని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. ఎవరైనా మృతి చెందినా, ప్రమాదంలో గాయపడినా, ఇల్లు కాలిపోయినా లేదా కుటుంబం ఏదైనా ఆపదలో ఉందని సమాచారం అందినా వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను పరామర్శించి తనవంతు సహాయం అందించే వ్యక్తిగా పల్లె రఘునాథ్ రెడ్డిని కొనియాడారు.గత 28 ఏళ్ల రాజకీయ, సామాజిక ప్రస్థానంలో పేదల వివాహాలు, విద్యార్థుల విద్య, ప్రమాదాలు, ఆపదల్లో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయాన్ని అందిస్తూ అనేక మందికి అండగా నిలిచారని టీడీపీ శ్రేణులు తెలిపారు.నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న సుమారు 75 వేల మందికి పైగా పేద ప్రజలకు రూ.8 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించినట్లు వారు పేర్కొన్నారు.

**విద్యాదాతగా ప్రత్యేక గుర్తింపు**

**రాజకీయాల్లోకి రాకముందే విద్యారంగంతో అనుబంధం కలిగిన డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, వెనుకబడిన రాయలసీమ ప్రాంత యువతకు విద్య ద్వారా మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో విద్యా సంస్థల స్థాపనకు కృషి చేశారు.1985-86లో శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సంస్థల ప్రస్థానాన్ని ప్రారంభించి, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ తదితర విద్యా సంస్థల అభివృద్ధికి కృషి చేశారు.ప్రముఖ కెమిస్ట్రీ లెక్చరర్‌గా రోజుకు సుమారు 14 గంటల పాటు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయనకు విద్యారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా సుమారు 9 జాతీయ, అంతర్జాతీయ విద్యా పురస్కారాలు లభించినట్లు విద్యాసంస్థల వివరాలు పేర్కొంటున్నాయి.**

**రాజకీయ ప్రస్థానంలో అనేక మైలురాళ్లు**

**1997లో టీడీపీలో రాజకీయ రంగ ప్రవేశం చేసిన డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, 1999లో నల్లమాడ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు.2007లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికై, 2009లో కొత్తగా ఏర్పడిన పుట్టపర్తి నియోజకవర్గం నుంచి తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.2014లో మరోసారి పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికై, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఐటీ, సమాచార-ప్రజా సంబంధాలు, తెలుగు భాషా-సంస్కృతి, ఎన్ఆర్ఐ సాధికారత-సంబంధాలు, మైనారిటీ సంక్షేమం తదితర ఐదు శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్‌గా కూడా బాధ్యతలు చేపట్టారు.**

**సినీ రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు**

**రాజకీయ, విద్యారంగాలతో పాటు సినీ రంగంలోనూ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. సినీ రంగంలో ప్రవేశించి జిల్లా కలెక్టర్ పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.**

**పల్లె కుటుంబం నుంచి ప్రజాసేవ కొనసాగింపు**

**పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజాసేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ 2024లో ఆయన కోడలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ తొలి మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం పల్లె కుటుంబం ప్రజా సేవలో కొనసాగుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు.**

**దేశ విదేశాల నుంచి శుభాకాంక్షలు**

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జన్మదినం సందర్భంగా అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణాఫ్రికా, లండన్, జర్మనీ, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ఉన్న ఆయన శిష్యులు, అభిమానులు శ్రీధర్, శ్రీనాథ్, సతీష్, వెంకట్, నాగరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు."మా గురువు పల్లె రఘునాథ్ రెడ్డి సార్‌కు జన్మదిన శుభాకాంక్షలు" అంటూ వారు తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.**

**భావోద్వేగానికి గురైన పల్లె**

**ఇంతకుముందెన్నడూ లేనివిధంగా భారీ సంఖ్యలో ప్రజలు జన్మదిన వేడుకలకు తరలిరావడంతో పల్లె రఘునాథ్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ప్రజలు, అభిమానులు చూపించిన ఆప్యాయతకు ఆనందభాష్పాలతో స్పందించారు.విద్యావేత్తగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం రాజకీయ ప్రతినిధిగా ప్రజాసేవకు విస్తరించి, సినీ రంగంలోనూ ప్రత్యేక పాత్రను పోషించే స్థాయికి చేరిందని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రజలతో సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తూ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.**

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



**రాయదుర్గం, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

రాయదుర్గం పట్టణంలోని ప్రధాన కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు హరిగోపాల్ మాదిగ డిమాండ్ చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల నూతన కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై దాడులను అరికట్టాలని కోరుతూ ఈ నెల 25న రాయదుర్గంలో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అమలు చేయాలని, ఎస్సీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, అర్హులైన డప్పు, చర్మకార వృత్తిదారులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి




**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.వీఆర్ఏల నిరసనలో భాగంగా నాలుగో రోజు పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనకు సీఐటీయూ నాయకుడు గంగాధర్, ఏఐటీయూసీ నాయకుడు ఈఎస్ వెంకటేష్ మద్దతు తెలిపారు.వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. మృతి చెందిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులకు వయసుతో సంబంధం లేకుండా కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో వీఆర్ఏల మండల నాయకులు చంద్ర, చిన్న ఓబులప్ప, మహేష్, నరసింహ, పోతులయ్య, షమీతాజ్, వెంకటలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల పోషకాహారంపై అవగాహన కల్పించాలి



**- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎస్ఎన్‌పీ మెనూ బోర్డులు ఏర్పాటు చేయాలి**

**అనంతగిరి,అనంత జనశక్తి న్యూస్ సెప్టెంబర్ 19:**

అనంతగిరి మండలం పినకోట అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్యం కోసం జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, తాజా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మునగాకులోని పోషక విలువలు, దాని వినియోగం, తయారీ విధానం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పోషకాహారంపై తల్లిదండ్రులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కేంద్రాల్లో ఎస్ఎన్‌పీ మెనూ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి, రోజువారీ ఆహార వివరాలను ప్రదర్శించాలని సూచించారు. పిల్లలకు తాజాగా వండిన వేడి భోజనం అందించడంతో పాటు, వివిధ రకాల పోషకాహారాన్ని మెనూలో చేర్చాలని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులపై ఆర్డీఓ పరిశీలన

**- నాణ్యతతో.. సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశం....**

**ధర్మవరం సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం డివిజన్ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ కొలతలు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, రికార్డుల పరిశీలనపై అధికారులతో సమీక్షించారు. జాయింట్ ఎల్‌పీఎంల విభజనలో పట్టాదారుల హక్కులు, భూమి విస్తీర్ణం, క్షేత్రస్థాయి అనుభవం, రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రైతులు, గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలను సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి రీసర్వేకు సహకరించాలని ఆర్డీఓ కోరారు.



# శృంఘార వల్లభుని శనివారం ఆధాయం రూ. 1.83 లక్షలు

పెద్దాపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్



పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో ఉన్న తొలి తిరుపతి గా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానము నకు శనివారం భక్తుల తాకిడి పెరిగిగింది. శనివారం సుమారు 10వేలు మంది భక్తులు దర్శించుకోగా ఒక్కరోజు ఆధాయంగా రూ.1,83,892 వచ్చింది. స్వామి వారిని ప్రత్యేక పూల అలంకరణ చేపట్టగా విశేష రీతిలో పూజలు చేపట్టారు. కాగా ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,22,910, అన్నదాన విరాళములు ద్వారా రూ. 43,217, కేశ ఖండన ద్వారా రూ. 3200, తులాభారం ద్వారా రూ. 150 , లడ్డు ప్రసాదం ద్వారా రూ. 14,415లు

వెరశి రూ.1,83,892 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారి వడ్డి శ్రీనివాస రావు చెప్పారు. కాగా దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. ఇంకా సుమారు 2500

మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటినారాయణాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొని సేవలు అందించారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం....



- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే

సామర్లకోట, సెప్టెంబర్ 19 :అనంత జనశక్తి న్యూస్

సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. శనివారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం చైర్మన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో శనివారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆసుపత్రి లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. కార్తిక్, వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు హాజరయ్యారు.ఆసుపత్రిలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత, మందుల లభ్యత, పారిశుధ్యం, రోగులకు మెరుగైన సేవలు అందించే అంశాలపై వైద్యులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్ల భద్రతను పరిశీలించిన డిఎస్పి



- రాప్తాడుకు వచ్చిన మంత్రి నారా లోకేష్ టీం
- పరిటాల శ్రీరామ్ తో కలిసి ఏర్పాట్ల పరిశీలన

రాప్తాడు సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఐటి విద్యాశాఖ మంత్రి, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతపురం డిఎస్పి చంద్రశేఖర్ రాప్తాడులో లోకేష్ పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తో కలిసి ఆయన లోకేష్ ర్యాలీ నిర్వహించబోయే ప్రాంతాలు, విగ్రహావిష్కరణ, పార్టీ కార్యకర్తల సమావేశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక పోలీసులకు భద్రతకు సంబంధించిన పలు సూచనలను డిఎస్పి చేశారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ టీం కూడా రాప్తాడులో పర్యటించారు. ఈనెల 22న లోకేష్ పాల్గొనబోయే కార్యక్రమాలు అన్నింటి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ పర్యటిస్తారు.. ఏ సమయానికి వస్తారు.. వంటి అంశాల గురించి శ్రీరామ్ తో పాటు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్టీ శ్రేణులకు కొన్ని సూచనలు కూడా లోకేష్ టీం చేసింది. రాప్తాడు పర్యటనకు సంబంధించి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలిరానున్నారని ఆయన చెప్పారు....

# సి ఎస్ డి టి ఆధ్వర్యంలో డీలర్లకు క్యూఆర్ కోడ్ అవగాహన సదస్సు

అమడగూరు సెప్టెంబర్19( అనంత జనశక్తి న్యూస్ )

మండల పరిధిలోని మహమ్మదాబాద్ గ్రామ సచివాలయంలో శనివారం నాడు సి ఎస్ డి టి నందిని అధ్యక్షతన మండల డీలర్లకు బియ్యముబస్తా కు అమర్చిన క్యూ ఆర్ కోడ్ గురించి డీఎస్ఓ అధికారు ల ఆదేశాల మేరకు అవగాహన సదుస్సు నిర్వహించారు అనంతరం ఆమె డీలర్లతో మాట్లాడుతూ డీలర్లు సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే గ్రూపులో షేర్ చేసి వివరణ అడగాలని ప్రతి బస్తాకు కీ క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేసుకోవాలని పంపిణీ సమయంలో కూడా ప్రతి బస్తాకు క్యూ యార్ కోడ్ స్కాన్ తీసి పంపిణీ చేయాలని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల డీలర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# ఐఎంఎం బాషా ఇంటికి టీడీపీ ముఖ్య నేతలు

- గత కొన్నిరోజులుగా అసంతృప్తిగా ఉన్న బాషా
- బాషా ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి
- బాషా వ్యక్తిగత కేసులు, సమస్యలు పరిష్కరిస్తామని హామీ

అనంతపురం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్



గత కొన్ని రోజులుగా వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న టీడీపీ మైనార్టీ నాయుడు ఐఎంఎం బాషా ఇంటికీ పార్టీ ముఖ్యనాయకులు వెళ్లారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మైనార్టీ టిడిపి నాయకులు శనివారం బాషా ఇంటికి వెళ్లి మాట్లాడారు. బాషా నాయకులతో తన సమస్యల గురించి చెప్పుకున్నారు. పార్టీ కోసం చాలా ఏళ్ల నుంచి కష్టపడుతున్నానని.. ఆర్థికంగా కొంత ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. తనకు 3వ్యక్తిగత కేసులు ఉన్నాయని వాటికి తనకు ఎలాంటి సంబంధం లేదని భాషా తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందిస్తూ చట్టపరంగా సాధ్యమైన పరిష్కార మార్గాలు చూపిస్తామని అన్నారు. అలాగే ముస్లిం మైనార్టీలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని.. గత ఎన్నికల ముందు చెప్పామన్నారు. దీనిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు బాషాకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన అంశాలన్నింటికీ సాయం చేస్తామన్నారు. అలాగే ఇళ్ల పట్టాల అంశంపై ఇప్పటికే పరిశీలన జరుగుతోందని.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే మైనార్టీలకు కచ్చితంగా పట్టాలు ఇస్తామన్నారు. సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంతో బాషా సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు పార్టీపై కానీ, నాయకులపై ఎలాంటి చెడు అభిప్రాయం లేదన్నారు. తాను పార్టీకి విధేయుడిగానే ఉంటానని బాషా తెలిపారు. ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు మా ఇంటికి వచ్చి నాతో మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మొద్దిన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూర్ మహమ్మద్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుడు పై దాడి హేమమైన చర్య

- -వైయస్సార్సీపి నాయకుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు ఆదినారాయణ రెడ్డికి హరీష్ బాబు పరామర్శ
- -దాడి ఘటనపై పోలీసు ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్చ
- -నేరస్థులు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్ష పడేలా చూస్తాం
- -అధైర్య పడవద్దు... అండగా ఉంటాం.
- -మంత్రి సత్యకుమార్ యాదవ్

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,
సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:



రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, సూచన మేరకు బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదినారాయణ రెడ్డిని శనివారం ఆయన నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పరామర్శించారు. ఇటీవల జరిగిన వైఎస్సార్సీపి నాయకుల దాడిలో గాయపడిన ఆదినారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని హరీష్ బాబు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు ధైర్యం చెబుతూ, కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హరీష్ బాబు భరోసా ఇచ్చారు. అనంతరం హరీష్ బాబు మంత్రి సత్యకుమార్ యాదవ్ తో ఫోన్ లో ఆదినారాయణ రెడ్డి ని, వారి కుటుంబ సభ్యులను మాట్లాడించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులతో స్వయంగా మాట్లాడి పరామర్శించారు. జరిగిన ఘటనపై ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే ఘటనకు సంబంధించిన విషయాలను పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, దాడికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, నేరస్థులకు శిక్ష పడేలా చూస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ కారణాలతో ఎవరైనా దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ప్రజల భద్రతకు మరియు శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని హరీష్ బాబు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి: ఎమ్మెల్యే



సామర్లకోట సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ప్రజా సమస్యల పరిస్కారానికి నిరంతరం కృషి చెయ్యనున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణంలోని శనివారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ప్రజల నుంచి స్వయంగా సమస్యలను తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని గ్రామ, వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారితో మమేకమై ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మణికుమారి, నూనె రామారావు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార్‌స్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీష్ మోహన్, తాతపూడి వంశీ, బలుసు వాసు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత...

- పూర్వ ఆహార పద్ధతులు పాటించాలి
- పోషణ మాస కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం, సెప్టెంబర్19 :అనంత జనశక్తి న్యూస్



అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. ఐసిడిఎస్ పెద్దాపురం ప్రాజెక్ట్ అధికారిణి
జి ఉషా ఆధ్వర్యంలో 9వ పోషణ మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం పెద్దాపురం డా. అంబేత్కర్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చిన రాజప్ప, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మణి కుమారి పాల్గొన్నారు.
భాగంగా వైవిధ్య భరితమైన పోషకాహారం అంగన్వాడి కేంద్రాలలో వేడిగా ఒండిన భోజనం సమాజ భాగ్యస్వామి జవాబుదారీతనం పోషణ ప్రాథమిక విద్య బాలల వికాసం ప్రధానమంత్రి మాతృ వందన యోజన తదితర అంశాలపై అంగన్వాడీలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలలకు ఏ విధమైన పౌష్టిక ఆహారం అందించాలనే విషయాలు ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నాయన్నారు. ప్రస్తుత వైవిధ్య ఆహార అలవాట్లతో వయసుతో సంభందం లేకుండా షుగర్, బిపి ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయాన్నారు. వాటిని అధిగమించేందుకు గానూ మన పూర్వీకుల ఆహారపు అలవాట్లను మనం అలవార్చుకోవాలన్నారు. సద్ది అన్నంలో అవసరమైన ఐరన్ లభిస్తుందని, రాగులు, జొన్నలు వంటి వాటితో తయారుచేసే ఆహార పదార్ధాలకు మరలా అలవాటు చేసుకోవాలని, తద్వారా ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు.
అనంతరం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంత కార్యక్రమాలను
ఎమ్మెల్యే చినరాజప్ప చేతులు మీదగా
చేపట్టారు. ఈ సందర్భంగా "మన అంగనవాడి మన బాధ్యత" అంశంపై చర్చ
నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు,
గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, బాలల అభివృద్ధిపై సిడిపివో ఉష
అవగాహన కల్పించారు. అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం, సమాజ సహకారం ఎంతగానో అవసరమని ఆమె వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న
పోషకాహార సేవలను చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు సద్విని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు చిన్నారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, పిట్టా జానకి రామారావు, సరోజ వాసు, పెద్దాపురం సి హెచ్సి వైద్యాధికారి డా. రాజేష్, డా. అనూష, ఐసీడిఎస్
సూపర్వైజర్స్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాప్తాడులో 44 పోలింగ్ కేంద్రాలు సిద్ధం



- 11 ఎం.పీ.టీ.సీ. స్థానాలకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

రాప్తాడు, సెప్టెంబర్ 19 అంత జనశక్తి న్యూస్

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎం.పీ.టీ.సీ.) 2వ సాధారణ ఎన్నికలకు రాప్తాడు మండలంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం–1994 నిబంధనల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజయవాడ వారి నోటిఫికేషన్ నెం. 533/ SEC-B1/2026, తేదీ 09-09-2026ను అనుసరించి రాప్తాడు మండల ప్రజా పరిషత్ పరిధిలోని 11 ఎం.పీ.టీ.సీ. స్థానాలకు సంబంధించి 44 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను శనివారం ప్రచురించారు.

రాప్తాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ తుది జాబితాను ప్రచురించినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి:
ఎల్ఆర్జీ హైస్కూల్, ప్రసన్నాయపల్లి–10, ఎంపీపీ స్కూల్ బొమ్మేపర్తి–02, ఎంపీపీ స్కూల్ బుక్కచెర్ల–02, ఎంపీపీ స్కూల్ ఎర్రగుంట–02, జెడ్పీ హైస్కూల్ గండ్లపర్తి–02, ఎంపీపీ స్కూల్ జి. కొత్తపల్లి–01, ఎంపీయూపీ స్కూల్ పాలచర్ల–01, ఎంపీపీ స్కూల్ భోగినేపల్లి–01, జెడ్పీ హైస్కూల్ బడమీదపల్లి–04, ఎంపీపీ స్కూల్ గొందిరెడ్డిపల్లి–02, ఎంపీపీ స్కూల్ పుల్లలరేవు–02, జెడ్పీ హైస్కూల్ రాప్తాడు–07, జెడ్పీ హైస్కూల్ హంపాపురం–02, ఎంపీపీ స్కూల్ గొల్లపల్లి–01, ఎంపీపీ స్కూల్ ఎం. చెర్లోపల్లి–02, జెడ్పీ హైస్కూల్ మారూరు–03 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

మొత్తంగా 44 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను సెప్టెంబర్ 19న రాప్తాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రచురించారు. దీంతో రాబోయే ఎం.పీ.టీ.సీ. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల విషయంలో స్పష్టత ఏర్పడింది.

# జౌళి శాఖ అవినీతి అధికారులపై కొరడా

- ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు.....

**అనంత జనశక్తి కథనానికి స్పందన..**

ధర్మవరం సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్ :

చేనేత కార్మికులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్ల విషయంలో అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేస్తున్న వేళ చేనేత, జౌళి శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది.
వివిధ జిల్లాల చేనేత, జౌళి శాఖ అధికారులతో మంత్రి సవిత అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించి పింఛన్లు, లబ్ధిదారుల ఎంపిక, పరిశీలన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.
ఈ సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియాతో పాటు అన్ని జిల్లాల సహాయ సంచాలకులు పాల్గొన్నారు. శనివారం అనంత జనశక్తి న్యూస్ లో ప్రచూరింపబడిన " చేనేత సర్టిఫికెట్లలో దందా" అనే వార్తకు స్పందించి పలు జిల్లాల్లో చేనేత పింఛన్ల పరిశీలనలో అక్రమాలు జరుగుతున్నాయన్న అంశంపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడాలని, అనర్హులకు పథకాల లబ్ధి చేరకుండా క్షేత్రస్థాయిలో పరిశీలనను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

**చేనేత పింఛన్లపై మంత్రి సీరియస్.....**

చేనేత పింఛన్ల పరిశీలనలో అవకతవకలకు సంబంధించిన ఫిర్యాదులపై మంత్రి సవిత అధికారులతో సమీక్షించినట్లు సమాచారం. మగ్గం నేస్తూ జీవనం సాగించే నిజమైన చేనేత కార్మికుడికి పథకం అందకుండా, అర్హత లేని వ్యక్తులకు ప్రయోజనం దక్కితే సహించేది లేదన్న రీతిలో మంత్రి అధికారులను హెచ్చరించినట్లు తెలుస్తోంది.
లబ్ధిదారుల ఎంపిక నుంచి పింఛన్ పరిశీలన వరకు ప్రతి దశలో నిబంధనలు పాటించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలనను మరింత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

**మంత్రి ఆదేశాలతో ఇద్దరు ఉద్యోగులపై చర్యలు....**

ఈ సమీక్ష అనంతరం శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి కీలక చర్యలు చోటుచేసుకున్నాయి. మంత్రి సవిత ఆదేశాలతో జిల్లాకు చెందిన సహాయ అభివృద్ధి అధికారులు రమణారెడ్డి, శీనా నాయక్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం చేనేత వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పింఛన్ల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, చేనేత పథకాల అమలులో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.




**అనంత జనశక్తి కథనాలతో మరింత చర్చ....**

ధర్మవరంలో చేనేత పింఛన్ల పరిశీలన, అర్హత లేని వారికి ప్రయోజనాలు అందుతున్నాయన్న ఆరోపణలపై 'అనంత జనశక్తి' వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం జరగాలన్న అంశాన్ని కథనాల ద్వారా ప్రస్తావించడంతో ఈ వ్యవహారం స్థానికంగా చర్చకు వచ్చింది. ఇదే సమయంలో మంత్రి సవిత జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో పింఛన్ల పరిశీలనలో అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేయడం, అనంతరం రమణారెడ్డి, శీనా నాయక్‌లపై (ఏ డి ఓ ల ) ను సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

**అర్హుడికి అందాల్సిందే.. అనర్హుడికి దక్కకూడదు....**

చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.
ముఖ్యంగా పింఛన్ పరిశీలనలో ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన తర్వాతే లబ్ధి అందేలా
చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తాజాగా ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ చర్యలు చేపట్టడంతో చేనేత శాఖలో బాధ్యత, పర్యవేక్షణపై మరోసారి చర్చ మొదలైంది. అయితే సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి కారణాలు, శాఖాపరమైన విచారణలో తేలే అంశాలు అధికారిక ఉత్తర్వులు, తదుపరి విచారణ ద్వారా స్పష్టంకావాల్సి ఉంది.





# కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు




- చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన న్యాయమూర్తి, పోలీసులు

కళ్యాణదుర్గం: సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత మాట్లాడుతూ బాలికల సంరక్షణ, పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై వివరించారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ విజ్ఞాన కమిటీ గౌరవ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె. భాను మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, విధులు, గృహహింస నిరోధక చట్టం తదితర అంశాలను వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు చట్టాలపై నమ్మకంతో సరైన న్యాయ సహాయం ఎలా పొందాలో తెలియజేశారు. విద్యార్థులు చదువుపై నమ్మకంతో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, ఇందుకు సంబంధించిన అంశాలను పలు ఉదాహరణలతో వివరించారు.
స్థానిక పట్టణ సీఐ వి. హరినాథ్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రత, మహిళల రక్షణకు ఉపయోగపడే శక్తి యాప్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
న్యాయవాదులు దాదా కలందర్, పట్టాభి, దిలీప్, మంజునాథ్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎదురయ్యే కష్టనష్టాలను వివరించారు. సమాచార హక్కు చట్టం, వినియోగదారుల హక్కుల చట్టం తదితర చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టాలపై మాత్రమే కాకుండా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, తమ జీవన విధానంలోని లోపాలను సైతం సరిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె. శ్రీధర్, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డాక్టర్ జి. మాధవీలత, అధ్యాపకులు అమృతలక్ష్మి, సౌగాంధిక, కలిముల్లా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ కష్ట సమయంలో ఒంటరిగా భావించవద్దు... మీకు మేమున్నాం

- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.. అధైర్యపడవద్దు..
- దహన సంస్కారాలు పూర్తి అయ్యేవరకు కుటుంబానికి అండగా హరీష్బుడు.
- క్షతగాత్రులను పరామర్శించిన హరీష్ బాబు.. మెరుగైన వైద్యం అందిస్తాం..
- మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు



శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,
సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని కదిరి గేటు వద్ద శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో శారదానగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల చిన్నారి వర్షిత మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురైన నేపథ్యంలో, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు శనివారం చిన్నారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. చిన్నారి వర్షిత పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేయించడంతో పాటు, అనంతరం దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటూ వారికి ధైర్యం కల్పించారు. చిన్నారి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన హరీష్ బాబు, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, వారికి ప్రభుత్వం మరియు మంత్రి సత్యకుమార్ యాదవ్ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి ధర్మవరం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను హరీష్ బాబు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, వైద్య చికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ.... చిన్నారి వర్షిత మృతి అత్యంత బాధాకరమని, ఈ ఘటన తమను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఈ కష్ట సమయంలో వారు ఒంటరిగా భావించాల్సిన అవసరం లేదని, మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు కూడా అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలిచి వారికి ధైర్యం కల్పించడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని హరీష్ బాబు పేర్కొన్నారు.

# తలసేమియా చిన్నారులకు అండగా ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్



- శ్రీ వర్ష హాస్పిటల్స్‌లో ప్రత్యేక ఆరోగ్య శిబిరం
- ఆధునిక చికిత్స, పోషకాహారం, వైద్య పరీక్షలపై అవగాహన

అనంతపురం, సెప్టెంబర్ 19,
అనంత జనశక్తి న్యూస్:

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్ (PGF) ఆధ్వర్యంలో శనివారం అనంతపురం సాయినగర్ 2వ క్రాస్‌లోని శ్రీ వర్ష హాస్పిటల్స్‌లో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డా. జి.వి. సుప్రజ చౌదరి ఆశీస్సులతో పి జి ఎఫ్ 'షీ లీడ్స్' విభాగం అధ్యక్షురాలు డా. అనితా రెడ్డి, డా. సౌమ్య శిబిరాన్ని సమన్వయం చేశారు. తలసేమియా చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవసరమైన వైద్య సూచనలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

**ఆధునిక చికిత్సపై వైద్యుల సూచనలు**

హెమటాలజిస్ట్ డా. సునీల్ తలసేమియా చిన్నారులకు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాలు, పోషకాహారం, క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన వైద్య పరీక్షలు, రోజువారీ సంరక్షణపై వివరించారు. తలసేమియా వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధి కావడంతో వైద్యుల సూచనల మేరకు నిరంతరం చికిత్స, పర్యవేక్షణ అవసరమని తెలిపారు.చిన్నారుల ఆరోగ్యం, జీవన నాణ్యత మెరుగుపడేందుకు సరైన వైద్య సంరక్షణ, పోషకాహారం, క్రమం తప్పకుండా పరీక్షలు, అవసరమైన చికిత్స ఎంతో ముఖ్యమని వైద్యులు సూచించారు.

**నిరంతర వైద్య సేవలకు పి జి ఎఫ్ హామీ**

తలసేమియా చిన్నారులకు నిరంతర వైద్య సేవలు, ల్యాబొరేటరీ సహాయం అందించాలని ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్ నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులకు క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణ, అవసరమైన పరీక్షలు, చికిత్సకు సంబంధించిన మార్గదర్శక సహాయాన్ని అందించేందుకు ఫౌండేషన్ ముందుకు వస్తోందన్నారు.తలసేమియా పిల్లలు, వారి కుటుంబాలు పిజిఎఫ్ తో అనుసంధానమై అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు**

ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన శ్రీ వర్ష హాస్పిటల్స్ సిబ్బంది శైలజ, ప్రవీణ, ప్రతాప్‌లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.
తలసేమియా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు భవిష్యత్తులోనూ అవసరమైన సేవలు అందిస్తామని తెలిపారు.తలసేమియా చిన్నారులు ఆరోగ్యంగా, ఆనందంగా, ధైర్యంగా జీవించేందుకు వైద్య సేవలతో పాటు సమాజం నుంచి సహకారం అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## విద్యార్థిని మృతి పట్ల సంతాపం...

- పాఠశాలకు సెలవు ప్రకటించిన హెడ్మాస్టర్ జానకి.

ధర్మవరం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:



పట్టణంలోని కదిరిగేటి వద్ద సెప్టెంబర్ 18 వ తేదీ సాయంత్రం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో శాంతినగర్ లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఆర్. వర్షిత అనే విద్యార్థిని వినాయక నిమజ్జనం సందర్భంగా మృతి చెందడం అత్యంత విషాదకరమని పాఠశాల హెడ్మాస్టర్ జానకి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ఈ దురదృష్టకర సంఘటన పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కుటుంబం తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నదని తెలిపారు. ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ ఆదేశాల మేరకు శనివారం సంతాప దినంగా ప్రకటించి పాఠశాలకు సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం భగవంతుడు ఇవ్వాలని వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వర్షిత మృతదేహానికి నివాళులర్పించారు. ఇటువంటి విషాద సంఘటన మనందరికీ ఒక గంభీరమైన హెచ్చరిక జీవిత పాఠము అని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఎటువంటి ప్రమాదకరమైన వాహనాలపై లేదా వాహనాల దగ్గర కు పంపరాదు అని తెలిపారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనాలు, ఊరేగింపులు, పండుగ కార్యక్రమాలకు పిల్లలు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు కూడా తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రద్దీ ప్రాంతాలలో విద్యార్థులను ఒంటరిగా పంపకుండా జాగ్రత్తలు కూడా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు భద్రతే మొదటి ప్రాధాన్యత అనే విషయాన్ని ప్రతి రోజు అర్థమయ్యేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కుటుంబంలోని పిల్లల భద్రత విషయంలో ఏ పార్టీ చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని వారు గుర్తు చేశారు. మన పిల్లలు మనకెంతో విలువైన వారు అని వారి ఆనందం కంటే ముందు వారి భద్రతను కాపాడడం తల్లిదండ్రుల ముఖ్యమైన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోయి భీమన్న సాహిత్యం సామాజిక చైతన్యానికి ప్రతీక



- ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జయంతి వేడుకలు

ఉరవకొండ సెప్టెంబర్ 19,అనంత జనశక్తి న్యూస్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండలో ప్రముఖ తెలుగు కవి, రచయిత, సామాజిక చైతన్యవాది బోయి భీమన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ శైలజ రాణి మాట్లాడుతూ బోయి భీమన్న సాహిత్య రంగానికి చేసిన సేవలను, సామాజిక చైతన్యం కోసం ఆయన సాగించిన కృషిని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి. సోమశేఖర్ మాట్లాడుతూ భీమన్న రచనలు అణగారిన వర్గాల జీవితాలను ప్రతిబింబించడంతో పాటు సామాజిక సమానత్వం, మానవతా విలువలను చాటిచెప్పాయని అన్నారు.ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు అయ్యన్న భీమన్న సాహిత్యం, వ్యక్తిత్వం, సమాజంపై ఆయన చూపిన ప్రభావాన్ని వివరించారు. భాషా అధ్యాపకులు నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు బోయి భీమన్న వంటి మహనీయుల సాహిత్యాన్ని అధ్యయనం చేసి వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.రాజకీయ శాస్త్ర అధ్యాపకులు సిరాజ్ అలీఖాన్, రసాయన శాస్త్ర అధ్యాపకులు హుమాయూన్ భీమన్న జీవిత విశేషాలు, సాహిత్య ప్రస్థానం, సామాజిక దృక్పథంపై మాట్లాడారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని బోయి భీమన్నకు ఘనంగా నివాళులర్పించారు.

# వేమన ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డికి ఘన సన్మానం..



గాండ్లపెంట, సెప్టెంబర్,19, అనంత జనశక్తి న్యూస్,

మండల పరిధిలోని కటారుపల్లి శ్రీ యోగి వేమన ఆలయ పీఠాధిపతి నందు వేమారెడ్డిని శనివారం కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి నందు వేమారెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ మక్బూల్ మాట్లాడుతూ కటారుపల్లి యోగి వేమన ఆలయంలో వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వేడుకల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించి భక్తుల మన్ననలు పొందిన నందు వేమారెడ్డి సేవలను ఆయన కొనియాడారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని మక్బూల్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు కుర్లి శివారెడ్డి, మాజీ సర్పంచ్ ఉత్తన్న, కృష్ణారెడ్డి, రామకృష్ణ, సుబ్బారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఖాజావలి, ఆసిఫ్ అలీ, పామిడి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత తోనే స్వచ్ఛ ఆంధ్ర




**- కే టి ఎస్ కళాశాల ప్రిన్సిపాల్.**

రాయదుర్గం, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

పరిసరాల పరిశుభ్రత తోనే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దీని ద్వారానే మనసు ఆహ్లాదకరంగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సహదేవుడు. శనివారం స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన మనస్సులు కూడా చురుకుగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మంచి ఆలోచనలు, సానుకూల దృక్పథానికి కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా భావించి తమ ఇల్లు ఎలాగో అలాగే కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులు కళాశాల ఆవరణలోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. తరగతి గదులను పరిశుభ్రం చేశారు . "మన పరిసరాలు – మన బాధ్యత", "పరిశుభ్రతే ప్రగతికి పునాది" అనే సందేశాన్ని విద్యార్థుల మనసుల్లోకి తీసుకెళ్లేలా అవగాహన కల్పించారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు సేవాభావంతో పాల్గొని పరిశుభ్రతపై తమ నిబద్ధతను చాటుకున్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డి. నారాయణ,ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కోదండరాములు. దొడ్డ నాగప్ప, ఎన్‌సీసీ సిటిఓ గోవర్ధన్ , అధ్యాపకులు డాక్టర్ ఎస్ .నాగరాజు, లక్ష్మీనారాయణ , బాబు, అమీర్ హుస్సేన్, మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# సాధనకు పేదరికం అడ్డంకి కాదు

**- విద్యార్థికి అండగా నిలిచిన**
**- ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్**

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఒక నిరుపేద విద్యార్థి నిరూపించాడు.కష్టపడి చదివే మనసున్నా, ముందుకు సాగడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించని తరుణంలో 'ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్అందించిన చేయూత విద్యార్థి జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది.

**అడుగడుగునా విద్యార్థికి ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ప్రోత్సాహం**

ఆ విద్యార్థి ప్రతిభను, చదువుకోవాలనే తపనను గుర్తించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్, తన ఇంటర్మీడియట్ చదువుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించింది. ట్రస్ట్ నమ్మకాన్ని నిలబెడుతూ, అహర్నిశలు శ్రమించిన ఆ విద్యార్థికి ఇంటర్మీడియట్ లో ఏకంగా 949 మార్కులు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేశాడు

**విద్యార్థి ఉన్నత విద్యకు దత్తత స్వీకరించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్**

ఇంటర్మీడియట్ లో సాధించిన ఈ ఘన విజయం ఆమె ఆశయాలకు మరింత ఊపిరి పోసింది. విద్యార్థిలోని పట్టుదలను, ప్రతిభను మరోసారి అభినందించిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులుఅతని బి.టెక్ ఉన్నత చదువు బాధ్యతను కూడా పూర్తిగా స్వీకరిస్తూ విద్యార్థిని దత్తత తీసుకుంది.

ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ప్రతిభావంతురాలైన విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న ఈ సేవలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ట్రస్ట్ అందిస్తున్న ఈ కొండంత అండతో ఆ విద్యార్థి తన ఇంజనీరింగ్ కలలను నిజం చేసుకుంటూ, భావి భారత ఇంజనీర్‌గా ఎదిగేందుకు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది.



# భక్తులారా... ఇక సెలవా..!





**- వెళ్లొస్తా...! తిరిగి మళ్లీ వస్తా...!**
**- నిమజ్జనానికి తరలిన లంబోదరుడు**
**- డీజే హోరులో యువత చిందులు.. భక్తి పారవశ్యంలో భక్తజనం.**
**-"గణనాథా... వర్షా లు కురిపించవయ్యా..! సల్లంగా చూడవయ్యా..!"**
**- అంటూ వేడుకోలు.**

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,
సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలో కొద్దిరోజులుగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న వినాయక చవితి ఉత్సవాలు నిమజ్జనంతో ఘనంగా ముగిశాయి. పలు ప్రాంతాల్లో కొలువుదీరిన లంబోదరుడికి భక్తులు కన్నీటి వీడ్కోలు పలుకుతూ.. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ ఆప్యాయంగా సాగనంపారు. వినాయక మండపాల వద్ద నిత్యం పూజలు, భజనలు, ప్రత్యేక కార్యక్రమాలతో సందడిగా సాగిన ఉత్సవాలు నిమజ్జన రోజున మరింత ఉత్సాహభరితంగా మారాయి.

ఉత్సవాల చివరి రోజు గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి, మంగళహారతులు ఇచ్చారు. అనంతరం నిమజ్జన యాత్రకు సిద్ధం చేశారు. గణనాథుడిని వాహనాలపై ప్రతిష్ఠించి ఊరేగింపుగా తీసుకెళ్తుండగా.. దారిపొడవునా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. గణపతి నామస్మరణలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

"గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా..!" అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు.

**అడుగడుగునా భక్తి సందడి....**

నిమజ్జన ఊరేగింపులో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ పాల్గొన్నారు. కొందరు భక్తులు గణనాథుడి ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోగా.. మరి కొందరు మంగళహారతులతో స్వామివారికి వీడ్కోలు పలికారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, గణనాథుడి నామస్మరణ చేస్తూ యాత్రలో పాల్గొన్నారు. చిన్నారులు రంగురంగుల దుస్తుల్లో సందడి చేస్తూ నిమజ్జన వేడుకలను మరింత ఆకర్షణీయంగా మార్చారు.

గణనాథుడి విగ్రహం ముందుకు కదులుతున్న కొద్దీ భక్తుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. దారిపొడవునా గణపతి నామస్మరణలు, జైజైకారాలతో పండుగ వాతావరణం నెలకొంది. కొందరు భక్తులు గణనాథుడిపై పూలు చల్లుతూ తమ భక్తిని చాటుకోగా.. మరికొందరు చేతులు జోడించి ప్రార్థనలు చేశారు.

**డీజే హోరులో యువత చిందులు**

నిమజ్జన యాత్రలో యువత సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీజే సంగీతం, డప్పుల మోతల మధ్య యువత ఉత్సాహంగా చిందులు వేస్తూ ఆనందాన్ని పంచుకుంది. స్నేహితులంతా ఒకచోట చేరి నృత్యాలు చేస్తూ నిమజ్జన వేడుకలకు మరింత కళ తీసుకొచ్చారు. యువత ఉత్సాహంతో వీధులు సందడిగా మారాయి. భక్తి పాటలతో పాటు గణనాథుడి జైజైకారాలు, డప్పుల మోతలు, డీజే శబ్దాలు కలగలిసి నిమజ్జన యాత్రకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. యువతలో కనిపించిన ఉత్సాహం.. చిన్నారుల్లో కనిపించిన ఆనందం.. మహిళల్లో కనిపించిన భక్తి.. వృద్ధుల్లో కనిపించిన ఆధ్యాత్మిక భావన.. మొత్తంగా నిమజ్జన వేడుకను ఓ పండుగ వాతావరణంగా మార్చాయి.

**"గణనాథా.. సల్లంగా చూడవయ్యా..!"**

నిమజ్జన వేళ భక్తుల మనసుల్లో భక్తి భావన మరింత బలపడింది. "గణనాథా.. మా కుటుంబాలను చల్లగా చూడు.. ప్రజలందరినీ సుఖసంతోషాలతో ఉంచు.. పాడిపంటలు సమృద్ధిగా పండేలా చూడు.. కరువు కాటకాల నుంచి కాపాడు.. వర్షాలు సమృద్ధిగా కురిపించు.. గ్రామాలు, పట్టణాలు సుభిక్షంగా ఉండేలా దీవించు" అంటూ భక్తులు గణనాథుడిని వేడుకున్నారు.

ప్రత్యేకంగా వర్షాల కోసం రైతులు, ప్రజలు గణనాథుడిని ప్రార్థించారు. "వర్షాలు కురిపించవయ్యా గణనాథా.. చెరువులు, కుంటలు నిండేలా చూడు.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు పూయించు" అంటూ భక్తులు మొక్కుకున్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రజల కష్టాలను దూరం చేసి సకల శుభాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**"వెళ్లొస్తా.. మళ్లీ వస్తా..!"**

కొద్దిరోజులుగా తమ వీధుల్లో కొలువుదీరి పూజలు అందుకున్న గణనాథుడిని నిమజ్జనానికి తరలించే సమయంలో భక్తుల్లో భావోద్వేగం కనిపించింది. ప్రతిరోజూ పూజలు అందుకున్న స్వామివారిని ఇప్పుడు సాగనంపాల్సి రావడంతో భక్తులు కాసేపు మౌనంగా నిలబడి దర్శించుకున్నారు. పూలమాలలు వేసి, మంగళహారతులు ఇచ్చి, చేతులు జోడించి వీడ్కోలు పలికారు.

"వెళ్లొస్తా.. తిరిగి మళ్లీ వస్తా.." అన్నట్టుగా గణనాథుడి నిమజ్జన యాత్ర సాగింది. నిమజ్జనం అనేది ముగింపు కాదని.. వచ్చే ఏడాది మరింత భక్తిశ్రద్ధలతో గణనాథుడిని ఆహ్వానించాలనే సంకల్పానికి ఇది ఆరంభమని భక్తులు పేర్కొన్నారు.

**భక్తి.. ఉత్సాహం.. ఆనందం.. ఒకటై..**

వినాయక చవితి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే వేదికగా నిలిచాయి. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఒకచోట చేరి ఉత్సవాల్లో పాల్గొనడం కనిపించింది. మండపాల వద్ద నిర్వహించిన పూజలు, ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నిమజ్జన వేళ అందరూ కలిసికట్టుగా గణనాథుడిని సాగనంపడం ద్వారా సామాజిక ఐక్యతను చాటారు.

చివరకు నిమజ్జన సమయం రానే వచ్చింది. గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించే సమయంలో భక్తులు మరోసారి గణపతి నామస్మరణతో పరిసరాలను మార్మోగించారు. పూల వర్షం కురిపిస్తూ.. కొబ్బరికాయలు సమర్పిస్తూ.. మంగళహారతులు ఇస్తూ తమ అభిమాన దేవుడికి వీడ్కోలు పలికారు.

"గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా..!" అంటూ చేసిన నినాదాలతో నిమజ్జన ప్రాంగణం మార్మోగింది. లంబోదరుడు నిమజ్జనంలో కలిసిపోయినా.. ఆయనపై భక్తుల విశ్వాసం మాత్రం మరింత బలపడింది. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని.. పాడిపంటలు సమృద్ధిగా పండాలని.. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని భక్తులు ఆకాంక్షించారు.

**భక్తులారా... ఇక సెలవా..!**
**వెళ్లొస్తా.. మళ్లీ వస్తా..**
**గణనాథా.. వచ్చే ఏడాది మరింత వైభవంగా రావయ్యా..!**

# ప్లాస్టిక్,నివారిద్దాం,ఆరోగ్యాన్ని,కాపాడుకుందాం

**- ఎంపీడీవో,శకుంతల**

అమడగూరు సెప్టెంబర్ 19
( అనంత జనశక్తి న్యూస్ )

అమడగూరు మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ప్రాంతంలో డి,డి, ఓ,నరేంద్ర, ఎంపీడీవో శకుంతల, ఆధ్వర్యంలో, స్వర్ణాంధ్ర స్వచంద్ర, భాగంగా, జీవీపీ, సిటి యు,స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర, కార్యక్రమంలో భాగంగా, జె,సి,బి, ట్రాక్టర్లతో, మొత్తం గార్బేజ్ హీప్, ను, తొలగించడమైనది,భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి, శ్రీ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ,అమడగూరు మండలంలో ఈ కార్యక్రమం ప్రతి మూడవ శనివారం స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, ఈ కార్యక్రమం నిర్వహించారు స్థానిక ఎంపీడీవో శకుంతల డి డి ఓ నరేంద్ర, మాట్లాడుతూ, ప్రతి పౌరుడు రోజు కొంత సమయం కేటాయించి పరిశుభ్రత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, అందులో,భాగంగా అమడగూరు బస్టాండ్ ఏరియా లో మరియు స్థానిక జడ్పీహెచ్ఎస్




స్కూల్లో ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు శనివారం పరిశుభ్రత నిర్వహణ పరిరక్షణపై ప్లాస్టిక్ నివారణ పై ప్లాస్టిక్ వినియోగించు కూడదని ప్లాస్టిక్ నియంత్రణపై గ్రామ ప్రజలకు, అక్కడకు వచ్చినటువంటి అధికారులకు,అవగాహన మరియు అధికారులు తెలియజేశారు చేత్త రోడ్డుపై, వేయకుండా, పక్కన ఉన్నటువంటి బాక్సులో కానీ, మరి ఏమైనా గోన సంచులు గాని వేసి చెత్త బండిలో వెయ్యాలని వేయాలని చెప్పారు అధికారుల మాటలు వినకుండా అక్కడ వ్యర్థ పదార్థాలు వేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో, శకుంతల,ఈ ఓ ఆర్ డి, రాజశేఖర్ పంచాయతీ కార్యదర్శి మమత, తెలియజేశారు అంతేకాకుండా బస్టాండ్ ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివిధ పరిసరాలు బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతారు మన పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యా,భద్రతకు శ్రీరామరక్ష వంటిది అని అధికారులు పేర్కొన్నారు బస్టాండ్ చుట్టుపక్కల ఉన్నటువంటి వివిధ చెత్తాచెదారం మరియు చికెన్ సెంటర్ల నిర్వాహకులు వేసినటువంటి కోడి పొట్టు, వ్యర్థ పదార్థాలు ఆసుపత్రికి వెళ్లే దారిలో వేయటంతో అక్కడ ఉన్నటువంటి ప్రజలకు దుర్వాసన వచ్చి చాలా ఇబ్బంది పడుతున్నారు వాటిని మరొకసారి వేయకుండా నిర్వాహకులకు తెలియజేసినట్లు అధికారులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిడిఓ నాగేంద్ర, ఎంపీడీవో శకుంతల, యు,ఓ ఆర్, డి, రాజశేఖర్,, ఏవో మల్లికార్జున్ రెడ్డి, ఎంఈఓ జిలాన్ భాష,మద్దిలేటి రెడ్డి,పంచాయితీ, కార్యదర్శి మమత, స్కూల్ హెచ్ఎం రమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజులు , పారిశుద్ధ కార్మికులు ప్రజలు,పాల్గొన్నారు

# హిందూపురంలో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ భద్రత



హిందూపురం సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

982 మంది పోలీసు సిబ్బందితో అప్రమత్త బందోబస్తు హిందూపురం పట్టణంలో ఆదివారం జరగనున్న వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

పోలీసు ఏర్పాట్లు

8 మంది డీఎస్పీలు, 33 మంది సీఐలు, 47 మంది ఎస్ఐలు సహా మొత్తం 982 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు కేటాయించామని అన్నారు.

శనివారం సాయంత్రం ఏఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బందోబస్తు సిబ్బందితో సమావేశం నిర్వహించి, నిమజ్జన ఏర్పాట్లు, విధులు, శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణ

శోభాయాత్ర మార్గాల్లో రద్దీని నియంత్రించడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు.

డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలకు తావులేకుండా చూడాలని, భక్తి, క్రమశిక్షణతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేలా నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక నిఘా,

సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చిన్న సమస్య కూడా పెద్దదిగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు, వీడియోలు ప్రచారం చేసే వారిపై నిఘా, వదంతులు వ్యాప్తి చెందకుండా పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని కోరారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్, సీఐలు అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# శిశుగృహాలోని అనాథ పిల్లలకు సంబంధీకులు ఆధారాలతో రావాలని పిలుపు.

పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 19
అనంత జన శక్తి న్యూస్.

**శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శిశుగృహలో సంరక్షణలో ఉన్న ఇద్దరు అనాథ బాలురకు సంబంధించి వారి తల్లిదండ్రులు లేదా రక్తసంబంధీకులు తగిన ఆధారాలతో సంప్రదించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి ప్రమీల శనివారం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19.09.2026 నుండి 30 రోజులలోపు సంబంధిత ఆధారాలతో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఎవరూ రాకపోతే, బాలల న్యాయ చట్టం-2015 మరియు దత్తత నియమ నిబంధనలు-2022 ప్రకారం బాలల సంక్షేమ సమితి ద్వారా వారిని అనాథలుగా ప్రకటించి అర్హులైన దత్తత కోరు తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.**

**మొదటి బాలుడు వయస్సు 3 నెలలు**
**రెండవ బాలుడు వయస్సు 1 నెల 15 రోజులు**
**ఉందని,సంప్రదించాల్సిన వారు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి కార్యాలయం, లో సంప్రదించాలని కోరారు.**





# విశాఖ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగించిన చంద్రబాబు

స్వర్ణాంధ్రస్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖలోని ఆర్కే బీచ్ తీరంలో సీఎం చంద్రబాబు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో సీఎం మాట్లాడారు. విశాఖ బీచ్‌కు దేశంలోనే మంచి పేరుందని, పర్యాటకులు ఎక్కువగా సాగరతీరానికి వచ్చేందుకు మక్కువ చూపుతారని, అటువంటి బీచ్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మీపైనే ఉందని సిబ్బందితో సీఎం అన్నారు.

**మూరీ మిక్చర్ బాగుంది..**

స్వర్ణాంధ్రస్వచ్ఛంధ్ర కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు బీచ్ పరిసరాల్లోని చిరు వ్యాపారులను పలకరించారు. ఈ సందర్భంగా మూరీ మిక్చర్, పీనట్ మసాలా తయారు చేసి విక్రయిస్తున్న అట్టాడ నాగమణితో మాట్లాడారు. ఆమె స్వయంగా తయారు చేసిన మూరీ మిక్చర్‌ను సీఎం రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. అనంతరం ఆమెకు డబ్బులు ఇచ్చి, కలిసి ఫొటో దిగారు. ఈ సందర్భంగా నాగమణి తన వ్యక్తిగత పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వ్యక్తిగత కారణాలతో భర్తతో విడాకులు తీసుకున్నట్లు, ప్రస్తుతం తనకు స్థిరమైన ఆదాయం, ఆధారం లేదని తెలిపారు. ప్రభుత్వం తనను అదుకోవాలని కోరారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న సీఎం ఒంటరి మహిళగా ఆమెకు పింఛను అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి బీచ్‌లోకి రాగానే శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌తో మాట్లాడారు. బీచ్‌లో పారిశుధ్య నిర్వహణ ఎలా కొనసాగుతోంది? వినాయక నిమజ్జనాలు ఎక్కువగా జరిగే సమయంలో వ్యర్థాలు ఎంత సమయంలో, ఏ విధంగా తొలగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీనికి గోవింద్ సమాధానమిస్తూ జీవీఎంసీ కమిషనర్ నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారని, రాత్రి ఒంటిగంట వరకు నిమజ్జనాలు జరిగినా ఉదయం ఆరు గంటలకల్లా బీచ్‌ను పూర్తిగా పరిశుభ్రం చేస్తున్నామని వివరించారు. మూడు షిఫ్టుల్లో మొత్తం 42 మంది కార్మికులు విధులు నిర్వహిస్తూ, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎంకు తెలిపారు.



# 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తి పడిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి...వాటి పరిశీలిన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం**

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తు దారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు



తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలందరికీ ఆర్థిక మేలు కలుగజేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల ప్రారంభించారన్నారు. ఇపుడు 50 ఏళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరుగార్చేలా కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఎటువంటి అపోహలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్**

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలిన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారరెడ్డి. ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. అర్హులను గుర్తించే సర్వేలో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# విశాఖ త్రాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై సీఎం సమగ్ర సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ, చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. విశాఖ తాగునీటి అవసరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇరిగేషన్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత నీటి వనరుల లభ్యత, నిల్వలు, పరిమితులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్లు, లిఫ్ట్‌ల ద్వారా నీటిని అందించే అవకాశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

**ఏలేరు–కణితి ద్వారా తాగునీటికి భరోసా**

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఏలేరు నుంచి ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కుల నీరు అందుతోందని మంత్రి తెలిపారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయగలుగుతున్నామని చెప్పారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10.2 టీఎంసీల నీరు ఉండగా, అందులో 6.1 టీఎంసీలు డెడ్ స్టోరేజ్గా ఉందన్నారు. 2027 జూన్ వరకు విశాఖకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని ప్రణాళికాబద్ధంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏలేరు నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని 300 నుంచి 350 క్యూసెక్కులకు పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలేరు డెడ్ స్టోరేజీలోని నీటిని కూడా వినియోగించుకునేలా మోటార్లు, పంపులను ముందుగానే సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

**రైవాడకు ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి**

విశాఖకు మరో ప్రధాన నీటి వనరైన రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 0.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. రైవాడ కింద ఉన్న సుమారు 5,000 ఎకరాల సాగును సమర్థవంతంగా నిర్వహిస్తూ, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారని చెప్పారు.రైవాడకు ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఎల్ఎంసీ 162వ కిలోమీటర్ వద్ద లేదా అనువైన ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైవాడకు నీరు అందించే ప్రతిపాదనలను వారం రోజుల్లో పరిశీలించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.



**మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీరు**

విశాఖకు మరో ముఖ్యమైన నీటి వనరైన మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ సామర్థ్యం 1.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీటిని అందించే పైప్‌లైన్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయని చెప్పారు. మొత్తం 10.5 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 1.5 కిలోమీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. మిగిలిన పైప్‌లైన్ పనులతో పాటు మోటార్లు, పంపుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మేఘాద్రిగెడ్డకు నీరు అందించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. రైల్వే, ఎలక్ట్రికల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించాలి**

తాటిపూడి రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 1.2 నుంచి 1.26 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విజయనగరం సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారని చెప్పారు. తక్కువ నీటితో పంటలు సాగు చేసే విధానాలను అవలంబించాలని, సాగునీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విజయనగరం కలెక్టర్‌ను సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**పురుషోత్తపట్నం లిఫ్ట్ చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనం**

విశాఖ తాగునీటి అవసరాల్లో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి అన్నారు. స్థానిక వర్షాలపై ఆధారపడే రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరును నింపడం వల్లే ప్రస్తుతం విశాఖకు కీలకమైన నీటి సరఫరా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా అప్పట్లో పురుషోత్తపట్నం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడం చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనమన్నారు. గతంలో పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను విమర్శించిన వారు, నేడు వాటి ప్రయోజనాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడంతో శ్రీశైలం నీటిని రాయలసీమ, నాగార్జునసాగర్ తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పురుషోత్తపట్నం ద్వారా ఏలేరును నింపడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా విశాఖ తాగునీటికి భరోసా ఏర్పడిందన్నారు.

**పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు**

2027లో పోలవరం పూర్తయిన వెంటనే పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం పూర్తయి ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాల ప్రయోజనం మరింత ముందుగానే అందేదని మంత్రి అన్నారు. పోలవరం విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాప్యం వల్ల ఉత్తరాంధ్రకు నీటి ప్రయోజనాలు ఆలస్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

**డేటా సెంటర్లపై తప్పుడు ప్రచారం వద్దు**

రాబోయే డేటా సెంటర్లకు అవసరమైన నీటి పరిమాణంపై కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి అన్నారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలను సమతుల్యం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై దీర్ఘకాలిక దృష్టి**

భవిష్యత్తులో విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందని మంత్రి తెలిపారు. గ్రావిటీ ద్వారా విశాఖకు నీటిని అందించే అవకాశాలను కూడా పరిశీలిస్తూ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

**సెప్టెంబర్ 23న మరోసారి సమీక్ష**

సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ఈ ఏడాది అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విశాఖకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 23న విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్, పురపాలక శాఖ అధికారులతో మరోసారి సమావేశమై విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. విశాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# ఏపీకి భారీ వర్ష సూచన పిడుగులతో కూడిన వర్షం పడే చాన్స్

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
## అప్రమత్తంగా ఉండాలి: వాతావరణ శాఖ

**అమరావతి, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో రాగల రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ వంటి పలు కోస్తా జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వాతావరణ మార్పులే అని అధికారులు తెలిపారు.

మరికొద్ది గంటల్లో ఉత్తర అండమాన్ సముద్రంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ అల్పపీడనం క్రమక్రమంగా బలపడి పశ్చిమ వాయువ్య దిశగా పయనించనుంది. ఈనెల 23 లేదా 24వ తేదీ నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా లేదా తుఫానుగా రూపాంతరం చెందే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఈ తుఫాను ఉత్తర కోస్తా – దక్షిణ ఒడిస్సా మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు మరింత పుంజుకోనున్నాయి. కోస్తా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రైతులు కూడా తమ వ్యవసాయ పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల తీవ్రతను బట్టి యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది.

# ఆర్థిక సాయం అందజేసిన పరిటాల శ్రీరామ్

- ధైర్యంగా ఉండండి... అండగా ఉంటాం.
- టిడిపి నాయకుల భరోసా...!

**ధర్మవరం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జనం సందర్భంగా,కదిరి గేటు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన చిన్నారి వర్షిత పార్థివ దేహాన్ని తెదేపా నాయకులు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.పండుగ రోజున పేద కుటుంబంలో విషాదం చోటు చేసుకోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెదేపా నాయకులు ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అందజేసిన 30 వేల రూపాయలను వర్షిత తండ్రి అశోక్ కు తెదేపా నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పణి కుమార్, పరిశే సుధాకర్, పురుషోత్తం గౌడ్, నాగూరు హుస్సేన్, రామకృష్ణ, ధనుంజయ నాయుడు, చింత పులుసు పెద్దన్న, జింకా పురుషోత్తం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- బయోగ్యాస్, సీ అండ్ డీ ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలి.
- సీ అండ్ డీ వ్యర్థాలతో తయారైన ఉత్పత్తులను జీవీఎంసీ పనుల్లో ఉపయోగించాలి.
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ.

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్**

నగరంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చేందుకు కాపులుప్పాడలో ఏర్పాటు చేసిన ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.శనివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని బయోగ్యాస్ ప్లాంట్, నిర్మాణ-కూల్చివేత (సీ అండ్ డీ) వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్లాంట్ల సామర్థ్యం, వ్యర్థాల సేకరణ, శుద్ధి ప్రక్రియ, ఉత్పత్తి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి బయోగ్యాస్ ప్లాంట్‌కు తరలించే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. హోటళ్లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల నుంచి తడి వ్యర్థాలు నిరంతరాయంగా ప్లాంట్‌కు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని సమర్థవంతంగా చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.అదేవిధంగా నగరంలో ఉత్పత్తయ్యే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వాటిని సీ అండ్ డీ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయంగా శుద్ధి చేసే విధంగా సమగ్ర వ్యవస్థను అమలు చేయాలన్నారు. ప్లాంట్ల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి, నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు సూచించారు.అనంతరం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి కలసి సీ అండ్ డీ వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావును అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ప్లాంట్‌ను నిర్వహించలేని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టి, జీవీఎంసీ ఆధీనంలోకి తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) రూపొందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.సీ అండ్ డీ వ్యర్థాల ద్వారా తయారైన పేవర్ బ్లాకులు, బిల్డింగ్ బ్లాకులు, ఇటుకలు తదితర ఉత్పత్తులను జీవీఎంసీ చేపట్టే ఇంజనీరింగ్, అభివృద్ధి పనుల్లో వినియోగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజును ఆదేశించారు. తద్వారా నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగంతో పాటు సహజ వనరుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, డీసీపీ రామ్మోహన్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు ,అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఎల్. రాజా రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పెళ్లి తర్వాత పెద్దగా మార్పేం రాలేదు.. విజయ్ ఉన్నితమైన వ్యక్తి



విజయ్ దేవరకొండను పెళ్లాడిన తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదని నటి రష్మిక అన్నారు. కెరీర్ పతాకస్థాయిలో ఉన్నప్పుడు వివాహం చేసుకున్నా.. తన ప్రయాణం యథావిధిగానే సాగుతోందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు.

"మేమిద్దరం కలిసే ఎదిగాం. తోటి నటులుగా మొదలై, బెస్ట్ ఫ్రెండ్స్‌గా మారి, ఇప్పుడు భాగస్వాములమయ్యాం. విజయ్ చాలా సున్నితమైన మనసున్న వ్యక్తి. సెట్‌లో పని పట్ల ఎంతో నిబద్ధతతో ఉండే ఆయన.. బయట చాలా ఆప్యాయంగా ఉంటాడు. పెళ్లికి ముందు.. ఆ తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదు. వరుస సినిమాలతో బిజీగా ఉండటం వల్ల రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతున్నా" అని రష్మిక పేర్కొన్నారు.

ఎప్పుడూ స్పాట్‌లైట్‌లో నిలబడటం అంటే.. ఎవరో తలపై తుపాకీ గురిపెట్టినట్లు అనిపిస్తుంది" అని స్టార్‌డమ్ తెచ్చే ఒత్తిడి గురించి ఆమె వివరించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. భర్త విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'రణబాలి' షూటింగ్ ఇటీవల పూర్తికాగా.. తను ప్రధాన పాత్రలో నటిస్తున్న మరో చిత్రం 'మైసా' చిత్రీకరణ చివరి దశలో ఉంది.. ఇక, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిజీవిత కథని తెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ' పేరుతో రూపొందుతున్న ఈ బయోపిక్‌లో రష్మిక ప్రధానపాత్రలో కనిపించనున్నారు.

## ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి అని అడుగుతున్నారు: రాధికా ఆప్టే



గతంలో తాను చేసిన బోల్డ్ పాత్రల వల్ల, కథలో అవసరం లేకపోయినా తనతో ముద్దు సీన్లు చేయించాలని కొందరు దర్శకనిర్మాతలు యత్నించారని బాలీవుడ్ నటి రాధికా ఆప్టే అన్నారు. తనను కేవలం లోదుస్తులతో ఓ యాక్షన్ సన్నివేశంలో నటించాలని అడిగారని ఆమె గుర్తుచేసుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాధికా.. సన్నివేశాల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"కెరీర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో నగ్నంగా నటించాను. అది చూసి 'ఆమె సులభంగా అంగీకరిస్తుందిలే' అని కొందరు అనుకుంటున్నారు. కానీ, ఇప్పుడు నేను అలాంటివి చేయడంలేదు. మూవీలో సన్నిహిత సన్నివేశాలు ఎందుకు అవసరమో స్పష్టమైన కారణం చెప్పాలని అడుగుతున్నాను. కొందరైతే 'ఓ 15 సెకన్లు ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి' అని అడుగుతున్నారు. అది వింటే నాకు నవ్వొస్తుంది" అని రాధికా పేర్కొన్నారు.

"ఒక సినిమా సెట్‌లో యాక్షన్ సన్నివేశం కోసం షర్టు గుండీలు విప్పేసి నటించగలరా? అని అడిగారు. యాక్షన్ సీన్ అంటే వేగంగా కదులుతాం కాబట్టి కుదరదని చెప్పా. పోనీ కేవలం లోదుస్తులతో అయినా చేయాలని అడిగారు. అసలు దీని ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారు? అని నేను వారిని ప్రశ్నించా. ఆ సీన్ చేయడానికి అంగీకరించలేదు. నన్ను అలా అడిగిన వ్యక్తి పేరు చెబితే మీరంతా కచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఆ స్థాయి ఉన్న వ్యక్తుల నుంచి అలాంటి మాటలు ఎవరూ ఊహించరు" అని రాధిక చెప్పుకొచ్చారు. కేవలం ప్రాజెక్ట్‌ను హిట్ చేయడానికి నటీమణులను హద్దులు దాటేలా ఒత్తిడి తేవడం సరికాదని ఆమె అన్నారు. రాధికా ఆప్టే ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'లస్ట్ స్టోరీస్ 3' వెబ్ సిరీస్‌లో నటించారు. ఆమెతో పాటు ప్రముఖ నటులు సిద్ధార్థ్, అదితీరావ్ హైదరీ, కొంకణా సేన్ శర్మ, రాధికా మదన్, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు.

## రెండో బిడ్డకు జన్మనిచ్చిన దీపిక పదుకొణె



బాలీవుడ్ స్టార్, రణ్‌వీర్ సింగ్ మరోసారి తల్లిదండ్రులయ్యారు. శనివారం (సెప్టెంబర్ 19న) దీపిక రెండోసారి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అందులో 'వెల్‌కమ్ బేబీ గర్ల్ (19-09-2026). ఇట్లు.. దువా, దీపిక, రణ్‌వీర్' అని రాసుకొచ్చారు. దీపిక, రణ్‌వీర్ దంపతులకు 2018లో ఇటలీలోని లేక్ కోమోలో ఘనంగా వివాహం జరి గింది. వీరికి తొలి సంతానంగా 2024లో 'దువా' జన్మించిన సంగతి తెలిసిందే. మరోవైపు దీపిక, రణ్‌వీర్ దంపతులకు బాలీవుడ్ నటీనటులు శుభాకాంక్షలు చెబుతున్నారు.

## మలయాళం ఇండస్ట్రీ నుంచి చాలా నేర్చుకోవచ్చు



'జడల్' పాత్రతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నటుడు నాని. ఆయన ప్రధానపాత్రలో నటించిన సినిమా 'ది ప్యారడైజ్' . శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో నాని బిజీగా ఉన్నారు. తాజాగా 'కొచ్చి'లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఇంకా ఈ సినిమాకు సెన్సార్ రాలేదని, 'A' సర్టిఫికెట్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని వల్ల పిల్లలు, కుటుంబ ప్రేక్షకులు థియేటర్‌లకు రాలేని మాట వాస్తవమే అయినప్పటికీ.. త్వరలోనే తన నుంచి కుటుంబ కథా చిత్రాలు వస్తాయని చెప్పారు. ఒక నటుడిగా అన్ని రకాల జానర్లను ప్రయత్నించాలని నాని అన్నారు. రెండు సినిమాల తర్వాత మళ్లీ 'భలే భలే మగాడివోయ్' లాంటి చిత్రంలో నటిస్తానని తెలిపారు.

"హిట్ 3' (Hit 3) ప్రచారం కోసం కొచ్చి వచ్చాను. ఏడాదిన్నర గడిచినా నాకు నిన్న వచ్చినట్లే ఉంది. ఇక్కడి వాళ్లు అంత ప్రేమ చూపిస్తారు. మలయాళం సినిమాలంటే నాకు ఎంత ఇష్టమో ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. ఈ ఇండస్ట్రీని చూసి చాలా నేర్చుకోవచ్చు. ముఖ్యంగా సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకుంటారు. మంచి సినిమాలను అందిస్తారు. ఇది పరిశ్రమలన్నీ నేర్చుకోవాలి" అని నాని ఈ సందర్భంగా అన్నారు. ఇక ప్యారడైజ్ ట్రైలర్ విడుదల చేయకపోవడం గురించి మాట్లాడుతూ.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఉండడం వల్ల ట్రైలర్‌ను తీసుకురాలేకపోయామని చెప్పారు. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని తెలిపారు. అవి అన్నీ ఒకేసారి థియేటర్‌లో చూడాలన్నారు.

## ఇవే నా చివరి ఆసియా గేమ్స్ కావొచ్చు: స్టార్ షట్లర్



భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడలే తనకు చివరివి కావొచ్చని తెలిపాడు. "మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడుతానో లేదో తెలీదు. బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు కావొచ్చు. ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నా. ఇటీవల వియత్నాం ఓపెన్‌లోనూ కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. గత ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నాం. ఈసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకం గెలుస్తామని ఆశిస్తున్నా" అని ప్రణయ్ చెప్పుకొచ్చాడు.

అయితే 2028లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగే ఒలింపిక్స్ ఆశలను మాత్రం అతడు వదులుకోలేదు. "ఎల్‌ఏ 2028ఏ నా లక్ష్యం. రాబోయే ఏడాదిన్నర వరకు గట్టిగా ప్రయత్నిస్తా. ఒలింపిక్స్‌కు వెళ్లే అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతా. లేకపోతే ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటా. కిదాంబి శ్రీకాంత్ కోర్టులో చూపిస్తున్న పట్టుదల నాకు స్ఫూర్తినిస్తోంది. అతన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నేనూ అలా ఆడగలననే నమ్మకం వస్తుంది" అని పేర్కొన్నాడు. డబుల్స్ స్టార్ ఆటగాడు చిరాగ్ శెట్టి మాట్లాడుతూ.. "నిరుడు రజతం సాధించాం. గతాన్ని పక్కనపెట్టి ఈసారి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాం. కోర్టులో చెలరేగే పులుల్లా ఆడి.. దేశానికి బంగారు పతకం అందిస్తాం. రాబోయే పది రోజుల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నాడు.

## ఆసియా గేమ్స్.. నఖ్వీ చేతుల మీదుగా మెడల్స్ తీసుకోవాల్సిందేనా..?




ఆసియా క్రీడల్లో భారత్‌కు మళ్లీ 'నఖ్వీ' సమస్య ఎదురవుతుందా? జపాన్ వేదికగా జరుగుతోన్న ఈ టోర్నీలో భారత క్రికెట్ జట్లు పతకాలు సాధిస్తే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్, ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా వాటిని స్వీకరించాల్సిందేనా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరి దీనికి నిబంధనలు ఏం చెబుతున్నాయి..? బీసీసీఐ స్పందన ఏంటీ..?

ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా నిబంధనల ప్రకారం.. ఆసియా ఒలింపిక్ మండలి అధ్యక్షుడు విజేతలకు మెడల్స్ అందిస్తారు. కొన్ని సందర్భాల్లో ఈ పతకాలు అందించే బాధ్యతను ఓసీఏలోని ఇతర సభ్యులకు కూడా అప్పగించే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. ప్రస్తుతం ఆసియా ఒలింపిక్ మండలిలో నఖ్వీ కూడా సభ్యుడే. ఒకవేళ మెడల్స్ ఇచ్చే బాధ్యతను నఖ్వీకి అప్పగిస్తే.. భారత ఆటగాళ్లు వాటిని స్వీకరించాల్సి ఉంటుందని భారత ఒలింపిక్ సంఘం వర్గాలు తెలిపాయి. అందుకు తిరస్కరిస్తే, గేమ్స్‌ను అగౌరపరిచిన కిందకే వస్తుందని పేర్కొన్నాయి. ఇక, మెడల్స్ ప్రదానోత్సవంలో ఎలాంటి రాజకీయ, మతపరమైన ప్రచారానికి అనుమతి ఉండదు.

ఈ అంశంపై బీసీసీఐకార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. "ప్రస్తుతానికి మా దృష్టంతా మ్యాచ్‌లు గెలవడంపైనే ఉంది. పతకాలు గెలిచిన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి దానిపై నిర్ణయం తీసుకుంటాం. అంతేగానీ, ఇంకా జరగని దాని గురించి ఇప్పడే మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. గత రెండు ఆసియా కప్‌లలో (2025లో పురుషులు, ఇటీవల మహిళల జట్టు) భారత జట్లు టైటిల్స్ సాధించినప్పుడు ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు బీసీసీఐ నిరాకరించిన సంగతి తెలిసిందే. ఆ ట్రోఫీలు కూడా మన దేశానికి వచ్చి చేరుతాయని సైకియా ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

## 'లక్ష్య' అభినయ్‌కి స్వర్ణం

**- సౌత్ జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్**



సౌత్ జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 'లక్ష్య' అథ్లెట్ల జోరు కొనసాగుతోంది. పుదుచ్చేరిలో జరుగుతున్న టోర్నీలో శుక్రవారం తెలంగాణకు చెందిన అభినయ్ నాయక్ డెకాథ్లాన్‌లో 5842 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. 110 మీటర్ల హర్డిల్స్ రేసును 14.17 సెకన్లలో పూర్తి చేసిన ఆంధ్ర కుర్రాడు తనీష్ తేజ రజతం నెగ్గాడు. షాట్‌పుట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నిత్య హాసిని (11.12 మీటర్లు) కూడా రజతం సాధించింది. షాట్‌పుట్ పురుషుల్లో సునీత్ కుమార్ (తెలంగాణ- 15.52 మీ), మహిళల్లో ఎండీ అసియా (ఏపీ, 11.91 మీ) కాంస్యాలు గెలిచారు. మెడ్లీ రిలేలో ప్రశంస (తెలంగాణ) 2:18.00 సెకన్ల టైమింగ్‌తో కంచు పతకం నెగ్గింది. 4×100 మీ. రిలేలో పుష్యమి నాగసాయి, సూరి ప్రిస్కిల్ల (ఏపీ) కాంస్యాలు సాధించారు. 1000 మీ. పరుగులో శివాని (తెలంగాణ) 3:05.99 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం గెలిచింది.

## టెక్‌బాల్ సెమీస్.. ఓడిన క్విమ్సి డిసౌజా: ఇంకా భారత్‌కు ఛాన్స్

: ఆసియా క్రీడల్లో టెక్‌బాల్ మహిళల సింగిల్స్‌లో ఆది నుంచి అదరగొట్టిన క్విమ్సి డిసౌజా .. సెమీస్‌లో తడబడింది. ఇండోనేసియా క్రీడాకారిణి సుమయా చేతిలో ఓడింది. అయితే క్విమ్సికి ఇప్పటికీ పతక అవకాశాలు మిగిలే ఉన్నాయి. ఆదివారం ఆమె కాంస్యం కోసం పోటీపడనుంది.

సెమీస్‌ను అద్భుతంగా ఆరంభించిన డిసౌజా మొదటి సెట్‌ను 12-7 తేడాతో గెలుచుకుంది. అయితే రెండో సెట్‌లో సుమయా అనూహ్యంగా పుంజుకుని.. 12-9 తేడాతో సెట్ గెల్చుకుంది. ఆ తర్వాత నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఇండోనేసియా క్రీడాకారిణి 12-7 తేడాతో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా.. సెమీస్‌లో ఓడిన వారు కాంస్యం కోసం పోటీపడే వీలుంది. ఈ క్రమంలోనే మూడోస్థానం కోసం కంబోడియాకు చెందిన కోమ్యేన్ డైతో క్విమ్సి తలపడనుంది.

టేబుల్ టెన్నిస్ + ఫుట్‌బాల్‌ను కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పైన చేతులతో కాకుండా మిగతా శరరీంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈ ఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ క్విమ్సి పోటీపడుతోంది. ఈ గేమ్‌లో భారత్‌కు ఆమె పతకం తీసుకువస్తే.. తొలి అథ్లెట్‌గానూ చరిత్రలో నిలిచిపోనుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314